



ఏ మొహం పెట్టుకుని
వస్తున్నావ్..?
అభివృద్ధి జాడ లేదు..



ఎండిపోయిన కొటిపి చెరువు

ప్రభుత్వాలు మారినా ప్రజాప్రయోజనాల విషయంలో పాలకులు పారదర్శకంగా ఉండాలి. వైసీపీ ఆ నైతిక సూత్రాలకు తిలోదకాలు ఇచ్చింది. తెలుగుదేశం హయాంలో చేపట్టిన అభివృద్ధే తప్ప.. జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ ఈ జిల్లాకు నెరవేర్చలేదు. మరోసారి మోసపూరిత మాటలు చెప్పి జనాన్ని నమ్మించడానికి ఐదేళ్ల తరువాత హిందూపురానికి వస్తున్నారు. ఆయన పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలు కానీ, ఆగిపోయిన అభివృద్ధి పథకాల విషయంలోకానీ చిలమత్తూరు మండలంలోని లేపాక్షి హబ్ పేరుతో ఆయన అస్మదీయులు లాక్కున్న భూములు, హంద్రీనీవా ద్వారా చెరువులను నింపడంలో వైఫల్యం, హిందూపురంపై ఐదేళ్లుగా ముఖ్యమంత్రి చూపిన అశ్రద్ధపై ఆయన పర్యటన సందర్భంగా ప్రత్యేక కథనం.

పరిశ్రమలు మూసిందే తప్ప.. తెరిచింది లేదు..
ఈ ప్రాంతంపై తీవ్ర నిర్లక్ష్యం
టీడీపీ హయాంలో చెరువులు కళకళ
ఐదేళ్లలో ఒక్క చెరువైనా నింపావా?
హబ్ పేరుతో భూములు లాక్కున్నదే తప్ప..
ఒక్క ఉద్యోగమైనా ఇచ్చావా?
నేడు హిందూపురానికి సీఎం జగన్



వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క అభివృద్ధి పథకమూ పూర్తిచేసింది లేదు. ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. మాటతప్పను.. మడమ తిప్పను అంటూ అసలుకే మోసం చేసిన ఘనుడు జగన్. తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప.. ఏ ఒక్క పని కూడా పూర్తి చేయలేదు. టీడీపీ హయాంలో అర్ధంతరంగా ఆగిన పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో మరోసారి జగన్ వస్తుంటే నియోజకవర్గ ప్రజలు ఏ మొహం పెట్టుకుని ఇక్కడికి వస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారు. **- హిందూపురం**

పరిశ్రమలు మూసిందే తప్ప.. తెరిచింది లేదు..

తెలుగుదేశం హయాంలో ఏర్పాటైన పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేశారు. ఇక్కడ స్టీల్‌తో పాటు ఫార్మసీ పరిశ్రమలు ఉన్నాయి. 2014నుంచి 2019 మధ్యన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవతో బర్జర్ పెయింట్స్, హెరిటేజ్, గార్మెంట్ పరిశ్రమలు తీసుకొచ్చారు. తద్వారా 6వేల మందికిపైగా మహిళలకు ఉపాధి దొరికింది. పరోక్షంగా 2 వేలమందికిపైగా ఉపాధి పొందుతున్నారు. ఈ ఐదేళ్లలో తూముకుంట పారిశ్రామిక వాడలో పరిశ్రమలకు విద్యుత్ బిల్లులు పెంచడంతోపాటు వైసీపీ నేతల బెదిరింపులు తాళలేక మూసివేశారు. కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు కాలేదు.

నాడు చెరువులకు జలకళ

టీడీపీ హయాంలో పెనుకొండ సమీపంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించి, హంద్రీనీవా ద్వారా నీటిని నింపారు. ఈ రిజర్వాయర్ నుంచి హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని చెరువులకు నీరిచ్చారు. తద్వారా భూగర్భజలాలు పెంపొంది, బోరుబావుల్లో నీరు పుష్కలంగా వచ్చింది. వేలాది మంది రైతులు పంటలు సాగుచేశారు. వైసీపీ పాలకులు ఒక్కచెరువు నింపకపోగా.. కాలువలను సైతం ఎండబెట్టారు. వారి నిర్లక్ష్యం పుణ్యాఆని భూగర్భజలాలు ఇంకిపోయి, భూములు బీడుగా మారాయి. దీంతో రైతులు నష్టపోయారు. తెలుగుదేశం హయాంలో రూ.520 కోట్లతో హంద్రీనీవా నీటిని ఎత్తిపోతల ద్వారా చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు సరఫరా చేసే పథకానికి నివేదికలు రూపొందించారు. డీపీఆర్ కూడా అయింది. వైసీపీ వచ్చాక దానిని మరుగున పడేసింది. ఈ ప్రాజెక్టు పూర్తిచేసి ఉండుంటే చిలమత్తూరు నుంచి పుట్టపర్తి వరకు హంద్రీనీవా నీరు పారేది. వైసీపీ ఆ విషయాన్నే విస్మరించింది.

లేపాక్షి ఉత్సవాల ఊసేలేదు

తెలుగుదేశం హయాంలో రెండుసార్లు లేపాక్షి ఉత్సవాలను అప్పటి సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తద్వారా లేపాక్షి ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారు. ఈ కారణంగా లేపాక్షి ఆదాయం ఏడాదికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెరిగి, పంచాయతీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.కోటి ఆదాయం సమకూరుతోంది. వైసీపీ హయాంలో లేపాక్షి ఉత్సవాల నిర్వహణ మరిచారు. అర్ధంతరంగా ఆగిన పనులు కూడా పూర్తి చేయలేదు.

భూములు లాక్కోవడంతో సరి..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చిలమత్తూరు మండలంలో లేపాక్షి హబ్ పేరుతో 8వేల ఎకరాలకుపైగా రైతుల నుంచి భూములు లాక్కున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామనీ, ప్రతి రైతు కుటుంబానికి ఉద్యోగాలిస్తామని నమ్మబలికారు. ఆ భూములు జగన్ అస్మదీయుల పేరుతో అప్పగించారు. భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి, రూ.కోట్లు రుణాలు పొందారు. విషయం బయట పడడంతో ఆ భూములు ఈడీ అటాచ్ చేసింది. ఇందులో ఒక్క పరిశ్రమ కూడా నిర్మించ లేదు. చిన్న ఉద్యోగం ఇచ్చింది లేదు. ఈ భూమాయ వెనుక అంతా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఉన్నారని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ భూములు కారుచౌకగా అమ్ముకున్న రైతులు పొట్ట చేతబట్టుకుని కర్ణాటకకు వలస వెళ్లారు. ఒకప్పుడు పంటలు పండిస్తూ ధైర్యంగా ఉండే రైతులు కూలీలుగా మారారు.

శాశ్వత పరిష్కారం ఊసేలేదు

జగన్ వస్తే పరిశ్రమలు వస్తాయనీ, ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పిన ముఖ్యమంత్రి ఐదేళ్లలో హిందూపురం ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదు. ఒక్క సమస్యకూ శాశ్వత పరిష్కారం కూడా చూపలేకపోయారు. ఐదేళ్లలో హిందూపురంపై జగన్ మార్కు ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి అబద్ధాలు చెప్పడానికి సిద్ధమై శనివారం హిందూపురానికి జగన్ రానున్నారు. ఎన్నికల ప్రచారం చేపట్టనున్నారు. ఆ అబద్ధాలను హిందూపురం ప్రజలు నమ్మే పరిస్థితులో లేరు. ఐదేళ్లలో హిందూపురంలో అధికార పార్టీ నాయకుల భూదందాలు, సెటిల్‌మెంట్లు, ఇతర ప్రాంతాలవారు ఇక్కడికి వచ్చి చేసిన దౌర్జన్యాలే కనబడుతున్నాయి. అక్రమ కేసులు, ఇసుక కర్ణాటకకు అక్రమ రవాణా, కర్ణాటక మద్యం ఇక్కడికి సరఫరా, గంజాయి కేంద్రంగా హిందూపురాన్ని మార్చడమే తప్ప.. అభివృద్ధి మాత్రం కనబడట్లేదు.

పురంలో కనిపించని అభివృద్ధి

హిందూపురం నియోజకవర్గం అంటే ఉమ్మడి రాష్ట్రంలోనే పేరుగాంచింది. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ప్రాతినిధ్యం వహించారు. ఆయన హయాంలో ఏర్పాటైన పరిశ్రమలు, విద్యాసంస్థలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. నందమూరి హరికృష్ణ, నందమూరి బాలకృష్ణ చేపట్టిన అభివృద్ధి పథకాలు కళ్లముందు కనిపిస్తున్నాయి. వైసీపీ పాలనలో హిందూపురం అభివృద్ధి బూతద్దంలో చూసినా కనబడదంటే ఈ నియోజకవర్గంపై ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. 2019 ఎన్నికలకు ముందు హిందూపురం పట్టణంలో రూ.66 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభిస్తే వైసీపీ వచ్చాక వాటికి నిధులివ్వలేక కాంట్రాక్టర్లు పారిపోయారు. ఆ పనులు ఆగిపోయాయి. వైసీపీ పాలనలో మునిసిపల్ పాలకవర్గం రైల్వే రోడ్డు విస్తరణ చేపడతామని మొదటి సంతకం పెట్టారు. మూడేళ్లు దాటినా అతీగతీలేదు. ఇండోర్ స్టేడియం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

బెంగళూరు వైపు నుంచి హిందూపురం వచ్చే రహదారిని విస్తరించాలని టీడీపీ హయాంలో నివేదికలు పంపారు. పనులు ప్రారంభమవుతాయనే సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లలో ఆ రహదారి, పెనుకొండ రోడ్డును విస్తరించలేదు. టీడీపీ హయాంలో కొటిపి వద్ద 2800 టిడ్కో ఇళ్ల నిర్మాణం 80శాతం పూర్తిచేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మిగిలిన 20శాతం పనులు చేయడానికి కూడా చేతకాలేదు. అక్కడే 3 వేల మందికిపైగా జగనన్న సిటీ చేస్తామని పట్టాలు ఇచ్చారు. పట్టుమని పదిండ్లు కూడా పూర్తికాలేదు.



ఎండిపోయిన లేపాక్షి చెరువు

ఒకే వేదికపైకి అమిత్ షా, చంద్రబాబు

రేపు ధర్మవరానికి రాక
ప్రచార సభలో ప్రసంగాలు



ధర్మవరం, మే 3: కేంద్ర హోంమంత్రి అమిత్ షా, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 5వ తేదీన ధర్మవరానికి రానున్నారు. అమిత్ షా పర్యటనకు సంబంధించి షెడ్యూల్ కూడా విడుదలైంది. చంద్రబాబు పర్యటన షెడ్యూల్ రావాల్సి ఉంది. 5న చంద్రబాబు రాప్తాడు బహిరంగ సభకు హాజరుకానున్నారు. అదేరోజు ధర్మవరం కూడా రానున్నట్లు సమాచారం. ధర్మవరంలో ఎన్డీఏ కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరఫున ప్రచారం చేయడంతోపాటు బహిరంగ సభలో అమిత్‌షా, చంద్రబాబునాయుడు పాల్గొంటారనీ, వారి పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు జీఎం శేఖర్, సందిరెడ్డి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బీజేపీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం వారు వివరాలను వెల్లడించారు.

అమిత్ షా షెడ్యూల్ ఇదీ..

ఉదయం 10.40గంటలకు: ధర్మవరం-బత్తలపల్లి ప్రధాన రహదారి పక్కనగల సీఎన్‌బీ ఫంక్షన్‌హాల్ సమీపంలో హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
11.00: సభావేదిక వద్దకు చేరుకుంటారు.
12.00గంటల వరకు: సభలో పాల్గొంటారు
12.10: గంటలకు సభావేదిక నుంచి బయల్దేరతారు
12.20 గంటలకు: ధర్మవరం హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు
12.30గంటలకు: బెంగళూరుకు బయలు దేరి వెళతారు
1.30గంటలకు: బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. దీంతో అమిత్‌షా పర్యటన ముగుస్తుంది.

చంద్రబాబుతోనే ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం

ఏపీఎన్జీఓ సంఘం మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల మాజీ నేతలు

పెనుకొండ రూరల్, మే 3: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఏపీఎన్జీఓల సంఘం మాజీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. జగన్‌ను చిత్తుగా ఓడించండని ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. స్థానిక మడకశిర రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్లు, సామాన్య ప్రజానీకం నడ్డివిరిచిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలన్నారు. 20వతేదీ వచ్చినా జీతాలు, పెన్షన్ల కోసం ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూడాల్సి వస్తోందన్నారు. 2014లో రాష్ట్రం ఆర్థిక లోటున్నా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్, 10శాతం పీఆర్సీ ఇచ్చారన్నారు. ఉద్యోగులకు రాయితీలు సకాలంలో చెల్లించారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల మాజీ నేతలు గురవయ్య, విజయ్ చౌదరి, నరసయ్య, సుబ్బారెడ్డి, వెంకటనరసయ్య, జయప్ప, ప్రభంజన్, టీడీపీ నాయకుడు, సవిత భర్త వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అన్నదాత ఆగ్రహం

రెవెన్యూ అధికారుల తీరుకు నిరసన.. మండుటెండలో రోడ్డుపై ఆందోళన



మండుటెండలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు

ఓబుళదేవరచెరువు, మే 3: సమస్యలు పరిష్కరించాలని రెవె న్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసి అన్నదాతలు విసిగిపోయి, ఆందోళన బాటపట్టారు. తమ భూములకు సంబంధించి వన్‌బీ, అండగళ్ జారీ, డిజిటల్ లాక్‌ను తొలగించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. మండుటెండలో అధికారుల నిర్లక్ష్యంపై నినదించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. సిబ్బందిని బయటకు పంపి, కార్యాలయానికి తాళం వేసి, నిరసన తెలిపారు. వీరికి బీజేపీ నాయకుడు ఆకుతోట రామచంద్ర, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ మున్నా మద్దతు తెలిపారు. రైతులు మాట్లాడుతూ.. పదిరోజులుగా వన్‌బీ, అండగళ్‌కు డిజిటల్ లాక్ తీయించాలని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామన్నారు. ప్రస్తుతం బ్యాంకు లో పంట రుణాల రెన్యూవల్‌కు వన్‌బీ తప్పనిసరి అన్నారు. తహసీల్దార్ ఖాజీబీ డిజిటల్ కీ తన వద్ద ఉంచుకుని, కార్యాలయానికి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వా పోయారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇంటింటికి బియ్యం
ఎక్కడ.. జగనన్నా..?

ఇళ్ల వద్దకే సరుకులు పంపిణీ చేస్తామని సీఎం జగన్ గొప్పలు చెప్పారు. అందుకోసం కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి, ఎండీయూ వాహనాలు కూడా కొనుగోలు చేశారు. వాటిని నెలనెలా బిల్లులు కూడా చెల్లిస్తున్నారు. అయినా.. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు సరుకులు మాత్రం చేరట్లేదు. కార్డుదారులకు తిప్పలు తప్పట్లేదు. చౌకధరల దుకాణం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. తనకల్లు మండలంలోని మల్లిరెడ్డిపల్లి దుకాణం వద్ద శుక్రవారం బియ్యం కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తూ కనిపించారు. మూడు నెలలుగా ఎండీయూ వాహనం ఇళ్ల వద్దకు రావట్లేదట. దీంతో తామే దుకాణం వద్దకెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నామని కార్డుదారుల వాపోయారు. సాకులు చెబుతూ వాహన ఆపరేటర్ ఇళ్ల వద్దకు రావట్లేదని వారు వాపోతున్నారు. బియ్యం మోసుకెళ్లలేక వృద్ధులు, దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. పేరుకే జగనన్న ఇంటింటికీ బియ్యం సరఫరా చేస్తున్నట్లు చెబుతున్నారనీ, తామే స్టోర్ వద్దకొచ్చి పడిగాపులు కాయాల్సి వస్తోందని వారు వాపోయారు. **- తనకల్లు**



దుకాణం వద్ద బియ్యం కోసం వేచివున్న కార్డుదారులు

జనం మార్పు కోరుకుంటున్నారు..

13వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారు..
టీడీపీ విజయం తథ్యం
మరిన్ని పరిశ్రమలు తీసుకొస్తాం

ఆంధ్రజ్యోతితో పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత

నియోజకవర్గ ప్రజలు టీడీపీవైపే..
నా విజయానికి ఢోకా లేదు..
చర్చంతా మెజార్టీపైనే.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న సవిత

హిందూపురం, మే 3: ప్రజలు మార్పు కోరుకుంటున్నారనీ, పోలింగ్ రోజు 13వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పెనుకొండ శాసనసభ అభ్యర్థి సవిత పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అందించే టీడీపీ పాలనను కోరుకుంటున్నారన్నారు. తెలుగుదేశం విజయం తథ్యమని ఆమె స్పష్టం చేశారు. 15 ఏళ్లుగా ఎన్నో సేవాకార్యక్రమాలు, అభివృద్ధి చేస్తున్న తమ వైపే నియోజకవర్గ ప్రజలు ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. తన గెలుపునకు ఢోకా లేదనీ, చర్చ అంతా తన మె జార్టీపైనేనని ఆమె ఉద్ఘాటించారు. ఎమ్మెల్యేగా గెలవగానే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననీ, నియోజకవర్గ గళాన్ని అసెంబ్లీలో వినిపిస్తానంటున్న సవిత 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలిలా..

ఆంధ్రజ్యోతి: మీ ప్రచారంలో స్పందన ఎలా ఉంది?

సవిత: ప్రచారంలో ప్రజల నుంచి స్పందన చాలా బాగుంది. ఎక్కడికెళ్లినా యువత, మహిళలు, కార్మికులు ఆదరణ చూపుతున్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశాడు. దీంతో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. 13వ తేదీ కోసం ఎదురుచూస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలన కోరుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యే అయితే నియోజకవర్గానికి ఏం చేస్తారు?

సవిత: ఇప్పటికే ప్రపంచ ప్రసిద్ధ కార్ల పరిశ్రమ కియను మా పార్టీ అధినేత, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారు. కియ అనుబంధ సంస్థలు కూడా వచ్చేవి. వైసీపీ ఎమ్మెల్యే, ఆ ప్రభుత్వం కారణంగా ఇక్కడకు రావాల్సిన అనుబంధ పరిశ్రమలు పరారయ్యాయి. నేను ఎమ్మెల్యే అవగానే అనుబంధ పరిశ్రమలను తీసుకొస్తాం. విద్యాసంస్థలతోపాటు మెడికల్ కళాశాలను ప్రారంభిస్తాం. సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ మండలాల్లో గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. రైతులకు పెద్దపీట వేసి, వ్యవసాయ మోటార్లకు మీటర్లు లేకుండా చూస్తాం. టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలన్నింటినీ అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: తాగు, సాగునీటి సమస్యను ఎలా పరిష్కరిస్తారు?

సవిత: టీడీపీ హయాంలో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరందించాం. దీంతో భూగర్భజలాలు పెరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత చెరువులకు నీరివ్వలేదు. టీడీపీ అధికారం చేపట్టగానే ప్రతి ఎకరాను ఆయకట్టుగా మార్చుతాం. ఎత్తిపోతల ద్వారా గోరంట్ల మండలానికి కూడా నీరందిస్తాం.

ఆంధ్రజ్యోతి: రైతులకు ఎలా భరోసా ఇస్తారు?

సవిత: వైసీపీ పాలనలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఇవ్వలేదు. గిట్టుబాటు ధరలు కల్పించలేదు. కల్తీ ఎరువులు విక్రయించడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 2019 ఎన్నికల ప్రచారంలో జాబ్ రావాలంటే జగన్ రావాలని చెప్పారు. జగన్ వచ్చాడు కానీ, జాబ్ ఎక్కడా కనిపించలేదు. నియోజకవర్గంలో చదువుకున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పిస్తాం.

ఆంధ్రజ్యోతి: జగన్ హామీలను జనం నమ్ముతున్నారా?

సవిత: జగన్మోహన్‌రెడ్డికి అబద్ధాలు చెప్పడంలో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చు. బాబాయిని చంపించి, చంద్రబాబుపై నెపం నెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది కదా..

ఆంధ్రజ్యోతి: మీ ప్రత్యర్థి (ఉషశ్రీ) పరిస్థితి ఎలా ఉంది?

సవిత: ఆమె వలస పక్షి. కళ్యాణదుర్గంలో దోచేసి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ కూడా ఇప్పటికే దోపిడీ ప్రారంభించారు. భూములపై కన్నేసినట్లు తెలుస్తోంది. ఇసుక ఎక్కడ బాగుంది, ఏ చెరువుని కొల్లగొట్టాలని సర్వే కూడా చేశారు. నేను 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నా. నా తండ్రి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సేవాకార్యక్రమాలు, చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో నేను గెలిచేశాను. మెజార్టీ ఎంతనేది తెలియాల్సి ఉంది. మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు టీడీపీవైపే ఉన్నారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు
జిల్లా స్థాయి కూపన్ నెం.2

పాఠకుని పూర్తి పేరు : ....
డోరు నెంబరు : .... వీధి పేరు : ....
గ్రామం/పట్టణం : .... మండలం : ....
జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

వైసీపీని 'బజ్జీ'చేసి పొట్లం కట్టేద్దాం..!



బజ్జీలు వేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం రూరల్, మే 3: 'ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని బజ్జీలలాగే సలసల కాగే నూనెలో వేయించి పొట్లం కట్టి పారేద్దాం' అని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పాపంపేటలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో స్థానికంగా ఓ కొట్టులో బజ్జీలు వేస్తూ.. ప్రచారంలో టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. మహిళలు తలచుకుంటే ఏమైనా చేయగలరని..అందుకే ఎన్డీయే కూటమి మేనిఫెస్టోలో వారికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టారని ఆమె గుర్తు చేశారు.

రాష్ట్రాన్ని కాపాడేది ఈ సైకిలే..!

హిందూపురం, మే 3: ఆగిపోయిన రాష్ట్రాభివృద్ధి ముందుకు సాగాలన్నా, నిర్వీర్యమైన వ్యవస్థలు నడవాలన్నా ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటేయాలని తెలుగుదేశంపార్టీ నాయకులు వినూత్న ప్రచారం నిర్వహించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, మురళిస్వామితోపాటు కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా వీధుల వెంబడి సైకిల్‌ని ఎత్తుకుని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం అభివృద్ధి చెందాలంటే రెండు ఓట్లు ఈ సైకిల్ గుర్తుకు వేయాలని విజ్ఞప్తి చేశారు.



వీధుల్లో సైకిల్‌ని ఎత్తుకుని వెళ్తూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఐదేళ్లయినా అక్కడే..!

5 శాతమే పెండింగ్... ముందుకు సాగని వైనం... షాదీఖానా నిర్మాణంలో నిర్లక్ష్యం



కల్లూరులో నిలిచిపోయిన షాదీఖానా

గార్లదిన్నె: జగన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో నిండా నిర్లక్ష్యం వహించింది. మండలంలోని కల్లూరులో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారు. 2018లో ముస్లింల సంక్షేమానికి టీడీపీ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి సుమారు రూ.15 లక్షలు సొంత డబ్బుతో స్థలం కొనుగోలు చేసి షాదీఖానా కోసం ఇచ్చారు. షాదీఖానా నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే యామినీబాల రూ. 35 లక్షలు నిధులు మంజూరు చేయించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 95 శాతం పూర్తయింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే షాదీఖానా భవన నిర్మాణం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో 5 శాతం పనులు పూర్తి చేయకపోవడంతో ముస్లింలు మండిపడుతున్నారు. షాదీఖానా పనులు పూర్తి చేయకుండా ముస్లింలపై చిన్నచూపు చూస్తున్నారని ఆ వర్గానికి చెందిన పలువురు వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీలపై వైసీపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ముస్లింలకు వైసీపీ మొండిచేయి చూపింది అనేందుకు కల్లూరులోని షాదీఖానానే నిలువెత్తు నిదర్శనమన్నారు. ముస్లింలపై జగన్‌రెడ్డి కపట ప్రేమను కురిపిస్తున్నరని ఆరోపిస్తున్నారు.

ఉద్యోగులకు చుక్కలు

సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.. రోడ్డెక్కించారు

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై వైసీపీ కక్షసాధింపు

మాట మార్చి...మడమ తిప్పిన సీఎం జగన్

గాలిలో కలిసిపోయిన సీపీఎస్ రద్దు హామీ

పీఆర్సీ అమలులో మోసం... బకాయిల చెల్లింపు పట్టని వైనం




శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు (ఫైల్)

ధర్మవరం, మే 3: అధికారంలోకి రాగానే వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తాం... ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం.. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం.. అని గత ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి...మడమ తిప్పారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చారు. ప్రతినెలా పెన్షన్లు, జీతాలకు ఎదురు చూసేలా చేశారు. పీఆర్సీ, డీఏ తదితర బకాయిలతో పాటు సకాలంలో పీఎఫ్ సొమ్మును కూడా చెల్లించకలేకపోయారు. ఎన్నడూ లేనివిధంగా వాటి కోసం రోడ్డెక్కెలా చేశారు. ఆందోళనలు చేసిన వారికి నోటీసులు ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలను గృహ నిర్బంధాలు, అక్రమ కేసులు, బైండోవర్‌తో కట్టడి చేశారు. మొత్తంగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను కక్ష సాధింపులకు గురిచేసింది.

ఇదీ పరిస్థితి..

శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు సుమారు 20వేలకు పైగా ఉన్నారు. వారు కాకుండా సచివాలయ పరిధిలో ఉద్యోగులు ఉన్నారు. వారంతా గత ఎన్నికల్లో జగన్ మాటలు నమ్మి వైసీపీకి ఓటు వేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని అనేక అవమానాలకు గురిచేశారు. ఎన్నికల్లో గెలిచాక సీపీఎస్ రద్దుపై మాట్లాడాలంటే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ప్రభుత్వం కొలువుదీరిన రెండేళ్లు మౌనంగా ఉన్న ఉద్యోగులు తరువాత ఉద్యమబాట పట్టారు. దీన్ని అడ్డుకునేందుకు అడుగడుగునా ప్రభుత్వం ప్రయత్నించినా ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ పోరాటాన్ని కొనసాగించారు. చివరికి ప్రభుత్వం చర్చలకు పిలిచి జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్) అంటూ కొత్తరాగం అందుకుంది. ఇది కూడా తమను మోసం చేసేదేనంటూ ఉద్యోగులు మళ్లీ ఆందోళనలు కొనసాగించారు. హక్కుల కోసం పోరాడుతున్నవారిపై పరోక్ష రూపంలో వైసీపీ క్షోభ పెట్టింది. గతంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతం వచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. ప్రతినెలా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. విశ్రాంత ఉద్యోగులు కూడా పెన్షన్ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్నిసార్లు 12వ తేదీ వరకు జీతాలు, పెన్షన్లు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. బ్యాంకు ఈఎంఐలు సకాలంలో కట్టలేక అవస్థలు పడ్డారు. పెన్షనర్లు వైద్యం, మందులు ఖర్చులకు ఇబ్బందులు పడ్డారు.



- గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించే పరిస్థితి ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించినా స్పందించకపోవడంతో వివిధ రూపాల్లో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.
- ఉద్యోగులకు జీపీఎస్, డీఏ, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలు ఇతర అలవెన్సులు జగన్ ప్రభుత్వం చెల్లించలేదు. ఐదేళ్లగా ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకోలేని పరిస్థితి.
- ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కూడా భారంగా మారింది. నిధులు కేటాయించక పోవడంతో సుద్దముక్కలు, రిజిస్టర్లు, డస్టరు ఇతర సామాగ్రి కొనుగోలుకు కొందరు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు సొంత డబ్బులను వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా సమగ్రశిక్షణ ద్వారా విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూళ్లకు నిధులు మంజూరు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి లేదు.
- మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ హాజరు నమోదు, మరుగుదొడ్ల శుభ్రత ఫొటోలు అప్‌లోడ్, నాడు-నేడు పనుల బాధ్యతతో టీచర్లపై పనిభారం పెరిగింది. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లుల చెల్లింపులు కాకపోవడంతో పలువురు ఉద్యోగులు తమ శభకార్యాలు, పిల్లల చదువులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

పీఆర్సీ ఇలా..

వైసీపీ ప్రభుత్వం 11వ పీఆర్సీలో ఉద్యోగులను మోసం చేసింది. ఎన్నడూ లేని విధంగా మధ్యంతర భృతి 27 శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి తగ్గించి 23 శాతం ఫిట్మెంట్ ఇచ్చింది. దీంతో ఐఆర్‌తో తీసుకున్న జీతం కంటే ఫిట్మెంట్‌తో తీసుకున్న జీతం తగ్గిపోయింది. దీనిపై కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పీఆర్సీ సిఫారసు చేసిన పేస్కేలును పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే 12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌ను వేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. వాస్తవంగా 2023 జూలై నుంచి కొత్త పీఆర్సీ కమిషన్ అమలు కావాలి. ఇదిలా ఉండగా ప్రతిసారిలానే వైసీపీ ప్రభుత్వం ఐఆర్‌కూ మంగళం పాడేసింది. దీనిపై ఉద్యోగుల సంఘాల నాయకులు నేటికి ఆవేదన చేస్తున్నారు.

దారి కష్టాలు తీరేదెన్నడో..?

మడకశిర నియోజకవర్గంలో రూ. 144 కోట్ల పనులు రద్దు

పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి మారినా అంతే..

జగన్ ప్రభుత్వంలో మరమ్మతులూ కరువే



పూలపల్లి- అగళి రోడ్డు



బంద్రేపల్లి రోడ్డు

మడకశిర, మే 3 : తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో మంజూరు చేసిన పనులను వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేయడంతో పలు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు ప్రయాణం సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి కి నిధులు మంజూరు చేసి, టెండర్లు, అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసింది. పనులు కూడా కొంత మేర జరిగాయి. ప్రభుత్వం మారడంతో 25శాతం లోపు జరిగిన పనులు రద్దు చేసి, 25 శాతం పైబడి జరిగిన పనులు కొనసాగించే విధంగా నిర్ణయం తీసుకుంది. మడకశిర నియోజకవర్గంలో సుమారు రూ.144 కోట్లకు సంబంధించి పనులు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. తర్వాత రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు చేయలేదు. దీంతో ఆ రోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం మడకశిర నియోజకవర్గంలోని ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.144 కోట్లు మంజూరు చేసింది. ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.60 కోట్లు మంజూరు కాగా ఇందులో భూసేకరణకు రూ.10 కోట్లు, రోడ్డుకు 50 కోట్లు కేటాయించింది. నియోజకవర్గ పరిధిలో ఆరు రోడ్లకు రూ. 50 కోట్లు, కిరికెర, మోర్‌బాగల్ వయా హేమావతి రోడ్డుకు రూ. 20 కోట్లు కేటాయించింది. అమరాపురం - విరూపసముద్రం రోడ్డుకు రూ.24 కోట్లు నిధులు మంజూరు చేశారు. టెండర్లు ప్రక్రియ ముగిసి పనులు కూడా ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో 25 శాతం లోపు జరిగాయని రూ.144 కోట్ల పనులు రద్దు చేసింది. మూడు సంవత్సరాలు దాటిపోయినా ఇప్పటి వరకు ఆ రోడ్లకు నిధులు మంజూరు కాలేదు. ఆ రోడ్ల నిర్మాణాలు పూర్తయి ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పూర్తయి ఉంటే మడకశిర రూపురేఖలు మారిపోయి ఉండేవని స్థానికులు అంటున్నారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఆర్ అండ్ బీ పరిధిలోకి పలు రోడ్లను బదలాయించి నాలుగు సంవత్సరాలు దాటిపోయినా తర్వాత వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీరాజ్ నుంచి ఆర్‌బీ పరిధిలోకి 258 కిలో మీటర్ల రోడ్లను బదలాయించారు. మడకశిర మండలంలో 70 కిలో మీటర్లు, అగళిలో 60 కి.మీ, రొళ్లలో 50 కి.మీ, గుడిబండలో 40 కి.మీ, అమరాపురం మండలంలో 38 కిలో మీటర్ల రహదారులను ఆర్ అండ్ బీ పరిధిలోకి మార్చారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్నప్పుడు మెటల్ వేసి మట్టిని వేశారు. శాఖ మారిందే కానీ రోడ్ల పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో ఆ రోడ్లు వర్షాలకు మరింత దెబ్బతిని గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

జగన్‌కు ఓటు వేస్తే నాశనమే

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్



మాట్లాడుతున్న షరీఫ్

పెనుకొండ టౌన్, మే 3: ఈసారి జగన్‌కు ఓటేస్తే మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి షరీఫ్‌తోపాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీజేపీని మైనార్టీలకు బూచిగా చూపిస్తూ డ్రామాలు ఆడుతున్నార న్నారు. పొత్తు కొత్తగా పెట్టుకోలేదని, గతంలోనే పొత్తు కొనసాగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం మైనార్టీలలో అనేకమంది రాజకీయంగా, విద్యా, ఉద్యోగరంగంలో బాగా రాణిస్తున్నారని వారు ఇలాంటి గిమ్మిక్కులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 120స్థానాల్లో టీడీపీ గెలవడం ఖాయమన్నారు. మిత్ర పక్షాలు 20సీట్లు గెలుస్తాయన్నారు. జూన్ 9న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నార న్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు దాదు, సామిల్ షౌకత్, బోలోనిస్సార్, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, కేశవయ్య, వెంకటరమణ, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బీకే, కందికుంట



ఎర్రకవంకపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీకే, పల్లె కిశోర్‌రెడ్డి

ధర్మానికి.. అధర్మానికి యుద్ధం

బీకే పార్థసారథి

కదిరి, మే 3: ప్రస్తుత ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి యుద్ధం జరుగుతోందని హిందూపురం పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారధి పేర్కొన్నారు. తలుపుల మండలకేంద్రంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ తొలుత శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో ధర్మం వైపు టీడీపీ కూటమి ఉందని, అధర్మం వైపు వైసీపీ ఉందని అన్నారు. సీఎం జగన్ ఓటమి భయంతోనే కూటమిపై అపద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి అధర్మ ముఖ్యమంత్రిని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధమవ్వాలన్నారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా, కందికుంట వెంకటప్రసాద్‌ను ఎమ్మెల్యే గెలిపించాలని పిలుపునిచ్చారు. తర్వాత ఆయన పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండలం ఎర్రవకంపల్లిలో యువ నాయకుడు పల్లె కృష్ణకిశోర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అక్కడ 60కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వారికి బీకేతో పాటు కృష్ణకిశోర్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, టీడీపీ గెలుపునకు కృషిచేయాలని, ఉన్న కొద్ది రోజుల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలని సూచించారు.

శంకుస్థాపన సరే.. రోడ్డేదీ..?

అర్ధంతరంగా ఆగిపోయిన రహదారి పనులు





రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కళ్యాణదుర్గం రూరల్, మే 3: వైసీపీ ప్రభుత్వ అభివృద్ధి పనులు శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కుందుర్పి మండలం జంబగుంపల గ్రామం నుంచి వెంకటాంపల్లి వరకు తారు రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీచరణ్ 2020లో శంకుస్థాపన చేసి వదిలేశారు. మూడు కిలోమీటర్లు తారు రోడ్డు కొరకు ఏఐబీ నిధులు 401.00 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య రహదారులు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల మధ్య వంక ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం

కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా



మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

రాయదుర్గం, మే 3: తెలుగుదేశం పార్టీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని కూటమి పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాయదుర్గంలోని అజీజీయా షాదీమహల్‌లో ముస్లిం మైనార్టీల తో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. రాయదుర్గం నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి శాసనమండలి మాజీ అధ్యక్షులు షరీఫ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ కేంద్రం సహకారం కోసమే టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకుందన్నారు. బీజేపీ విధానాలు, సిద్ధాంతాలతో తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా సామరస్యాన్ని కాపాడే విధంగా లౌకికవాదాన్ని పెంపొందించే విధంగా చంద్రబాబునాయుడు పాలన ఉంటుందని పేర్కొన్నారు. గతంలో పలుసార్లు టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ మైనార్టీలకు ఎలాంటి హానీ కలగలేదన్న విషయాన్ని గుర్తుచేశారు. పలు ఆర్థిక నేరాలల్లో 16 నెలలు జైలు శిక్ష అనుభవించిన జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న ల్యాండరింగ్, సీబీఐ కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి తొత్తుగా వ్యవహరించారని విమర్శించారు. దాదాపు 32 కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ జైలు పాలు కావాల్సి వస్తుందన్న నెపంతో ఐదేళ్లపాటు బీజేపీకి సానుకూలంగా వ్యవహరించాడని ధ్వజమెత్తారు. ముస్లింలపై మైనార్టీల సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పేర్కొన్నారు.

పెద్దనోటు ఉన్నింటేనా..!



అనంతపురం రూరల్, మే 3: పెద్ద నోట్ల రద్దు ఎందుకు జరిగిందోగాని.. ఆ నోటే ఉండింటే చాలా సమస్యలు తీరేవీ అనుకుంటున్నారు జనం. ప్రచార సమయంలో నాయకుడు డబ్బులు తీస్తే.. అతడి వంక ఎగాదిగా చూస్తున్నారు. ఆయన వంద, రెండువందలు, ఐదు వందల నోట్లు ఎన్నిస్తారో తెలీదు. వంద నోట్లు పది ఇచ్చిన వెయ్యి దాటదు. రెండు వందల నోట్లు ఐదు ఇచ్చినా, లేక ఐదు వందల నోట్లు రెండించిన ఇంతేనా అన్నట్లుంది. అదే రెండువేల నోటు ఉండింటే..ఆ కథే వేరుగా ఉండేదంటున్నారు. నాయకుడు ఇవ్వననలేడు, లేదని చెప్పలేడు. ఇచ్చినా చిల్లర ఇవ్వమని అడగలేడు. ఆ నోటు ఒకటిచ్చినా ఆ రోజుకు పండగే. నాయకులకు కూడా చిన్న నోట్లతో చిక్కులు తప్పడం లేదు. రెండు వేల నోటు ఉండింటే వంద మందికి రెండు వేల చొప్పున చెట్టు కిందో..ఏదో సందులోనో యాడో చోటో రెండు కట్టలు అలా పంచేసి చేతులు దులిపేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.500 నోటుతో వంద మందికి పంపిణీ చేయాలన్నా.. నాలుగు కట్టలు జేబులో పెట్టుకోవాలి. ఎవడు ఎక్కడి నుంచి వస్తాడో తెలీదు. ఎప్పుడు ఎలా పంచాలో తెలియక, ఏం జరుగుతుందోనన్న టెన్షన్‌తో ఇబ్బంది పడుతున్నారు.

గుడ్డిగా నమ్మి ఓట్లేశాం



- నారాయణస్వామి

జగన్ సీఎం అయితే మాకు ఇల్లు వస్తుందని గుడ్డిగా నమ్మి ఓట్లు వేశాం. కానీ జగన్ ఐదేళ్ల పాలనలో ఇంటి హామీ నెరవేరలేదు. గత ఎన్నికలప్పుడు కొందరు వైసీపీ వాళ్లు మాఇంటి వద్దకు వచ్చి మాకు ఈసారి ఒక్కసారి ఓట్లు వేయండి. మీ ఇద్దరు కుమారులకు ఇళ్లు ఇప్పిస్తామన్నారు. ఐదేళ్ల గడిచిన మాకు ఇళ్లు ఇవ్వలేదు. 20 రోజులు కిందట శ్మశానంలో ఒకరికి రెండ్లు సెంట్ల పట్టా ఇచ్చినట్లు పేపర్లు ఇచ్చారు. నేను, నా కొడుకులు బాడుగ ఇంటిలోనే ఉన్నాము. జగన్ వస్తే మాటామీద నిలబడుతాడు అన్నారు. మరి ఏదీ? ఈ ఎలక్షన్లలో మాత్రం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే చంద్రన్నకు ఓట్లు వేస్తాము. పింఛన్ కూడా రూ.4వేలు అంటున్నాడు కదా.

- శింగనమల

ఇచ్చిన మాట తప్పేవారు కాదు

- దండు నారాయణస్వామి, పెద్దమట్లగొంది



అప్పట్లో ఎన్నికలు వచ్చాయంటే ప్రచారానికి వచ్చిన అభ్యర్థి మాట ఇస్తే తప్పేవారు కాదు. గెలిచాక గ్రామానికి వచ్చి పెద్దలకు హామీ ఇచ్చిన మేరకు పనులు పూర్తి చేసేవారు. 50 ఏండ్ల కిందట నాకు ఓటు హక్కు వచ్చింది. అప్పటి ఎలక్షన్‌లో అభ్యర్థి గ్రామంలో ప్రచారం చేయడానికి ఎద్దుల బండి మీద వచ్చాడు. గుడిలో అందరూ గ్రామస్థులు ఒక తెల్ల పేపర్ మీద రాసి ఇచ్చారు. రెండు నెలలు తరువాత గెలిచిన వ్యక్తి వచ్చి మా ఊరి రోడ్డుకు ఇరువైపుల మట్టి తోలించారు. గ్రామస్థులు అందరూ ఆయన్ను ఎద్దుల బండి మీద ఊరేగించారు. ఇప్పటి ఎలక్షన్ స్వార్థపూరితంగా ఉన్నాయి. ఎలక్షన్ అంటే మద్యం, డిన్నర్లు పెట్టి, దడ్లు ఇచ్చి తమ వైపునకు తిప్పుకుంటున్నారు. గెలిచాక గ్రామం వైపు తొక్కి తొంగిచూడరు.

- శింగనమల

జన చైతన్యం
ఆంధ్రజ్యోతి

రచ్చబండ రాజకీయమే శాసనం



అప్పట్లో ప్రతి గ్రామానికి రచ్చబండ అని ఒకటుండేది. అక్కడే ఏదైనా పంచాయితీ కానీ, నిర్ణయాలు కానీ చేసేవారు. అక్కడి నిర్ణయాలు శాసనంగా అమలయ్యేవి. అక్కడ రాజకీయంగా కూడా ఓ నిర్ణయం తీసుకున్నా, గ్రామస్థులందరూ దానికే కట్టుబడి ఉండేవారు. గ్రామానికి ఎవరైనా అధికారులు వచ్చినా సరే రచ్చబండ వద్దే సమావేశాలు ఏర్పాటు చేసి, చర్చించేవారు. అంతటి ప్రాధాన్యం ఉన్న రచ్చబండ రాజకీయానికి నూకలు చెల్లిపోయాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో వీటి పట్ల ఆసక్త చూపేవారే కనుమరుగయ్యారు.

- కళ్యాణదుర్గం

చిర్రెత్తిస్తున్న ఫోన్‌కాల్స్

సోషల్ మీడియాలో ప్రధాన పార్టీల ప్రచారాల జోరు

పదునైన విమర్శలు చేసుకుంటున్న వైనం



కొత్తచెరువు, మే 3 : సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈనెల 13న శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. శ్రీసత్యసాయిజిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలకు గాను 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒక ఎంపీ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు ప్రజల మద్దతు పొందేందుకు ఎవరికి తోచిన రీతిలో వారు ప్రచారాలను నిర్వహిస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు పదునైనా విమర్శలు చేసుకుంటూ హోరెత్తిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్.. ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోలను ప్రజలకు తెలియజేసేందుకు వాహనాలకు పెద్దపెద్ద డిజిటల్ టీవీ స్ర్కీన్లను ఏర్పాటుచేసి జనసమూహం ఉన్నప్రాంతాల్లో ప్రదర్శిస్తున్నాయి. ప్రస్తుతం ప్రతి ఒక్కరు స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నారు. ఈ ఎన్నికలలో ప్రధాన పార్టీల అభ్యర్థులు సెల్‌ఫోన్లను ప్రచార అస్త్రాలుగా వినియోగించుకుంటున్నారు. 'నేను మీ పలాన పార్టీ అభ్యర్థిని.. ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో మీరు నాకు ఓటు వేసి ఆశీర్వదించాలి.. ఇట్లు మీ బిడ్డ, మీ నాయకుడు' అంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఫోన్ ఎత్తితే ఇదే గోల. ఈ ప్రచారాలతో జనాలు చిర్రెత్తుతున్నారు.

నేను మీ సైకిల్ గుర్తును..



వాహనం పై ఉన్న సైకిల్

అనంతపురం రూరల్, మే 3: ఎన్నికల ప్రచారంలో సైకిల్ జనాన్ని ఆకట్టుకుంటోంది. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలో శుక్రవారం ఓ వాహనంపై సైకిల్‌ను ఆకర్షణీయంగా ఉంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని వీధుల్లో ఇంటింటి ప్రచారంలో నేను టీడీపీ గుర్తును..ఈ గుర్తు పోలింగ్ బూత్‌లోని ఓటింగ్ మెషీన్‌లో రెండు చోట్ల కనిపిస్తాను. ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థి ఓటింగ్ మెషీన్, మరొకటి ఎంపీ అభ్యర్థి ఓటింగ్ మెషీన్‌లో మీకు తారసపడుతాను. నేను కనిపించగానే అమాంతం బటన్ నొక్కేయండీ అంటూ ఈ సైకిల్ తన ప్రచారాన్ని సాగించింది. ప్రజలు ప్రచారంలోని ప్రచారాన్ని చూస్తూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే యామినిబాల టీడీపీలోకి చేరిక



చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరిన మాజీ ఎమ్మెల్యే యామినిబాల

శింగనమల మే 3: శింగనమల మాజీ ఎమ్మెల్యే యామినిబాల టీడీపీలో చేశారు. ఇటీవల ఆమె వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం చీరాలలో ఆమె టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పసుపు కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరలా సొంత గూటికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఎప్పుడు కూలుతుందో.. ఏమో..!

బొమ్మనహాళ్, మే 3: తాము అధికారంలోకి వస్తే డిజిటల్ లైబ్రరీ నిర్మిస్తామన్నారు. కానీ ఉన్నవాటికి కనీసం మరమ్మతులు చేయించలేని దుస్థితిలో వైసీపీ పాలకులు ఉండిపోయారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం ఎప్పుడు కూలుతుందోనన్న స్థితిలో ఉంది. దీంతో నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులు భయాందోళన చెందుతున్నారు. కొంతమంది రావడం మానేశారు. అధికారులు పలుమార్లు శిథిలభవనాన్ని చూసి వెళుతున్నారే తప్ప కనీసం భవనానికి మరమ్మతులు చేయించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గదులతో పాటు వరండా పూర్తిగా దెబ్బతింది. స్లాబు దెబ్బతిని ఇనుప కమ్మీలు బయటపడి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఇక వర్షం వస్తే గదుల్లో ఉన్న పుస్తకాలు, పత్రికలు తడిసి ముద్దవుతాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీకో డిజిటల్ లైబ్రరీ(గ్రంథాలయం) నిర్మాణం చేస్తామని హామీలు ఇచ్చారు. అవి ఇప్పటికీ నిర్మాణాలకు నోచుకోలేదు.



శిథిలావస్థకు చేరుకొన్న బొమ్మనహాళ్ గ్రంథాలయం

నియోజకవర్గ చరిత్ర



అటు కర్ణాటక.. ఇటు కడప.. చిత్తూరు జిల్లాల సరిహద్దులోని కదిరి ప్రాంతం చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. వ్యవసాయమే ఇక్కడ జీవనాధారం. నిత్యకరువులతో వ్యవసాయం కుదేలయింది. భూస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుపోయిన ఈ ప్రాంతం.. అనేక విప్లవాలకు పురుడు పోసుకుంది. ప్రజాకవి యోగివేమన తన కలంతో సమాజంలో పేరుకుపోయిన మూఢత్వాన్ని చీల్చిచెండాడాడు. ఎస్‌ఏ రవూఫ్ లాంటి విప్లవ నాయకులను అందించిన గడ్డ ఇది. ఖాద్రీ నృసింహుడి ఆలయం ఈ ప్రాంతానికే మకుటాయమానం. పాలకులు ఎందరు మారినా ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించలేదు. దీంతో అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి.

కదిరి మ్యాప్



చైతన్యానికి ప్రతీక

వ్యవసాయమే జీవనాధారం

నిత్యకరువులతో వ్యవసాయం కుదేలు

వలసబాటలో రైతులు, కూలీలు

కదిరి నియోజకవర్గ అభివృద్ధి పట్టని పాలకులు

కదిరి, మే 3 : కదిరి పేరు వింటేనే గుర్తు వచ్చేది ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి. ఖాద్రీ వృక్షాలు ఎక్కువగా ఉండడం వల్ల మొదట ఖాద్రీగా కాలక్రమేణా కదిరిగా పేరు వచ్చింది. 1910లో కదిరి తాలూకా కడప జిల్లా నుంచి విడిపోయి అనంతపురం జిల్లాలో కలిసింది. రాష్ట్రంలోనే అతి పెద్ద తాలూకాగా పేరుగాంచింది. గతంలో 10మండలాలు కలసి కదిరి తాలూకాగా ఉండేది. కదిరికి కరువుకు విడదీయరాని బంధం ఉంది. అనేక సంవత్సరాలుగా కరువు కదిరి ప్రాంతంలో తిష్టవేసింది. ఉపాధికి ఎటువంటి పరిశ్రమలు లేవు. వర్షాధార పంటలే జీవనాధారం. ఇందులో వేరుశనగ ముఖ్యమైనంది. వేరుశనగ పంటకాలం పూర్తయితే ఇక్కడి రైతులందరూ కూలీలే. ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని 20 ఎకరాల ఆసామి కూడా వలస వెళ్లాల్సిందే. కదిరి నుంచి బెంగళూరు నగరంలో వలస కూలీలుంటున్న హోంగసంద్ర అనే ప్రాంతానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారంటే వలసలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామితోపాటు ఇక్కడ కొన్ని పుణ్యక్షేత్రలు, దర్శనీయ స్థలాలున్నాయి. కదిరి మల్లెలకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానముంది.

ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం

కదిరి పేరు వింటేనే ప్రసిద్ధి చెందిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం గుర్తుకు వస్తుంది. ఇక్కడ ప్రహ్లాద సమేత లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఉగ్రరూపంలో ఉండే లక్ష్మీనరసింహస్వామి కదిరిలో ప్రశాంత లక్ష్మీనారాసింహుడుగా దర్శనమిస్తారు. ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాలు 15 రోజుల పాటు బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా తరలి వస్తారు.


1952నుంచి గెలిచిన ఎమ్మెల్యేల వివరాలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	కేవీ వేమారెడ్డి	కాంగ్రెస్	5,273
1955	కేవీ వేమారెడ్డి	కాంగ్రెస్	1,063
1962	ఇ.గోపాల్‌నాయక్	కాంగ్రెస్	1,076
1967	కేవీ వేమారెడ్డి	కాంగ్రెస్	13,097
1972	సి.నారాయణరెడ్డి	ఇండిపెండెంట్	2,002
1978	నిజాంవలీ	కాంగ్రెస్	15,808
1983	మహమ్మద్‌షాకీర్	టీడీపీ	21,457
1985	సీహెచ్ అబ్దుల్‌రసూల్	టీడీపీ	10,928
1989	మహమ్మద్‌షాకీర్	కాంగ్రెస్	18,275
1994	జొన్నా సూర్యనారాయణ	టీడీపీ	55,231
1999	ఎంఎస్ పార్థసారథి	బీజేపీ	9,770
2004	జొన్నారామయ్య	కాంగ్రెస్	8,938
2009	కందికుంట వెంకటప్రసాద్	టీడీపీ	14,977
2014	అత్తార్ చాంద్‌బాషా	వైసీపీ	968
2019	డాక్టర్ పీవీ సిద్దారెడ్డి	వైసీపీ	27,243

కదిరి నియోజకవర్గ చరిత్ర

కదిరి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 2009లో నియోజవర్గాల పునర్విభజన తరువాత కదిరి, తలుపుల, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాలను కదిరి నియోజకవర్గంగా విభజించారు. నియోజవర్గ ఓటర్ల సంఖ్య 2,50,776. వీరిలో పురుషులు 1,23,742, మహిళలు 1,27,027 మంది ఉన్నారు. కదిరి మున్సిపాలిటీ ఉంది. అత్యధికంగా ఇక్కడ మైనార్టీ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం 1962లో ఎస్టీకి రిజర్వు అయింది. 1952 నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ, ఒక్కోసారి బీజేపీ, ఇండిపెండింట్ గెలిచారు. మొదటి సారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీ వేమారెడ్డి 5,273 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయన అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జొన్నా సూర్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ షాకీర్‌పై 55,231 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

తొలి ఎమ్మెల్యే వేమారెడ్డి



కదిరి నియోజకవర్గానికి మొదటి శాసనసభ సభ్యుడిగా కదిరి మున్సిపాలిటీలోని కుటాగుళ్లకు చెందిన కేవి వేమారెడ్డి ఎన్నికయ్యారు. 1952 నుంచి 1962 వరకు ఆయన ఎమ్మెల్యే పనిచేశారు. తరువాత 1967 నుంచి 1972 వరకు శాసనసభ్యుడిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా 1971లో నవంబరు 25న ఎన్నికయ్యారు. 1972 మార్చి 19వరకు ఆ పదవిలో ఉన్నారు

ఇప్పటి వరకు నియోజవర్గ చరిత్రలో ఇదే అత్యధికం. 2014 ఎన్నికల్లో అత్తార్ చాంద్‌బాషా తన సమీప ప్రత్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌పై 968 ఓట్లతో గెలిచారు. ఇదే అత్యల్ప మెజార్టీ.

కటారుపల్లిలో యోగి వేమన సమాధి

మూఢ నమ్మకాలను తన పద్యాలతో ప్రశ్నించిన మహాకవి యోగివేమన సమాధి గాండ్లపెంట మండలం కటారుపల్లిలో ఉంది. ఇక్కడ యోగివేమన జీవ సమాధి అయినట్లు చరిత్ర చెబుతోంది. పల్నాడు జిల్లా కొండవీడు ప్రాంతం నుంచి యోగివేమన ఒంటరిగా కటారుపల్లికి వలస వచ్చారు. ప్రతి సంవత్సరం ఇక్కడ వేమన తిరుణాల నిర్వహిస్తుంటారు.

బట్రేపల్లి జలపాతం

తలుపుల మండలంలోని బట్రేపల్లికి సమీపంలో ఉండే అటవీ ప్రాంతంలో జలపాతం ఉంది. కదిరి - పులివెందుల రోడ్డుకు సమీపంలో ఎత్తయిన కొండపై నుంచి నీటి ప్రవాహం వాలు జారుతుంది. ఈ జలపాతం వర్షాకాలంలో దాదాపు మూడు నెలల పాటు పర్యాటకులకు కనువిందు చేస్తుంది.

విప్లవయోధుడు రవూఫ్



కదిరి ప్రాంతం చైతన్యానికి మారుపేరు. కదిరి మున్సిపాలిటీలోని కుటాగుళ్ల విప్లవాల గడ్డగా పేరుంది. కుటాగుళ్ల విప్లవయోధుడు రవూఫ్ జన్మస్థలం. ఆయన నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. కదిరి ప్రాంత సమస్యలపై నిరంతర పోరాటం చేశారు. విద్యావంతుడైన రవూఫ్ ప్రజాన్యాయవాదిగా పేరొందాడు. కమ్యూనిస్టు రాజకీయాల వైపు మొగ్గు చూపిన ఆయన.. తొలుత సీపీఐలో తర్వాత సీపీఎంలో పనిచేశారు. తరువాత సీపీఎం నుంచి సీపీఐ ఎంఎల్‌గా విడిపోయినపుడు ఆయన కూడా ఎంఎల్ పార్టీలోకి వెళ్లారు. అప్పటి నుంచి దేశంలో వివిధ ప్రాంతాల్లో చారుమజుందార్ వంటి వారితో కలిసి విప్లవ ఉద్యమాల్లో పాల్గొన్నారు. చనిపోయేంతవరకు కమ్యూనిస్టుగా, నిస్వార్థపరుడిగా జీవితాన్ని గడిపారు.

ప్రధాన సమస్యలు..

కదిరి నియోజకవర్గం ముఖ్యంగా వ్యవసాయంపై అధారపడింది. సాగునీరు ఇక్కడ ప్రధాన సమస్య. ఎలాంటి సాగునీటి సదుపాయం లేదు. నియోజవర్గంలో దాదాపు 100 చెరువులకు పైగా ఉన్నాయి. నదులు లేకపోవడంతో వ్యవసాయమంతా భూగర్భ జలాలపైనే అధార పడి ఉంది. హంద్రీనీవా ద్వారా చెరువులకు నీళ్లు అందిస్తామని వైసీపీ హామీలు ఇచ్చింది కానీ ఎలాంటి పనులు చేపట్టలేదు. 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు అలాగే ఉండిపోయాయి. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా కదిరి, తలుపుల, నంబులపూలకుంట మండలాలకు నీళ్లు అందాల్సి ఉంది. అదే విధంగా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కదిరి, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట మండలాలు నీళ్లు చేరాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలతున్నా హంద్రీనీవా పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. హంద్రీనీవా ద్వారా నీరు అందిస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామలమవుతాయి.



● కదిరి నియోజవర్గంలో కరువు నిత్యం ఉంటుంది. ఉపాధి కోసం అన్ని వయసుల వారు వలసలు వెళుతుంటారు. ఉపాధినిచ్చే పరిశ్రమలు ఒక్కటీ లేవు. చదువుకున్నవారు, చదువు లేని వారు బెంగళూరు, తిరుపతి, హైదరాబాదు వంటి నగరాలకు నిత్యం వలస వెళుతుంటారు.

● ఈ ప్రాంతంలో వేరుశనగ, టమోట అత్యధికంగా పండిస్తారు. వీటికి గిట్టుబాటు ధర లేక ఆదర ణ కరువయింది. వేరుశనగ విస్తీర్ణం తగ్గుతోంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

● పర్యాటక రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురయింది. ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తిమ్మమ్మమర్రిమాను, యోగివేమన సమాధి ఉన్న కటారుపల్లిలో, బట్రేపల్లి జలపాతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేస్తే కదిరి అభివృద్ధి చెందుతుంది.

● కదిరి పట్టణంలో దాదాపు 10 వేల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారు. నిత్యం అనేక జబ్బులతో సతమతమవుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా ఈఎస్‌ఐ ఆసుపత్రి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి ఎన్నికకు ఇదే వాగ్దానంగా మిగిలిపోతోంది.

● కదిరి పట్టణంలో దాదాపు 1.20 లక్షల మంది జనాభా ఉన్నారు. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థతో పాటు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటి బాగు చేయాలని ప్రజలు కోరతున్నారు. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని వైసీపీ ఇచ్చిన హామీ నేరవేరలేదు.

గిన్నిస్ రికార్డులకెక్కిన తిమ్మమ్మమర్రిమాను


తిమ్మమ్మ మర్రిమాను

ప్రపంచంలో కెల్లా అతి ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టుగా నంబులపూలకుంట మండలం గూటిబైలు గ్రామంలో ఉండే తిమ్మమ్మ మర్రిమాను ప్రసిద్ధి చెందినది. ఇది దాదాపు 7.6 ఎకరాలకు పైగా విస్తరించించి ఉంది. తిమ్మమాంబ చనిపోయే ముందు ఈశాన్య దిక్కులో నాటిన మర్రి మొక్క నేడు మహావృక్షం అయిందని చరిత్ర చెబుతోంది. 1989 డిసెంబర్ 19న గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది.

నియోజకవర్గంలో మండలాల వారిగా ఓట్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కదిరి అర్బన్	38,731	40,900	03	79,834
కదిరి రూరల్	13,215	13,559	01	26,775
తలుపుల	16,786	16,845	01	33,632
నంబులపూలకుంట	12,161	12,120	00	24,281
గాండ్లపెంట	10,584	10,786	02	21,372
తనకల్లు	19,992	20,175	00	40,167
నల్లచెరువు	12,273	12,642	00	24,915
మొత్తం	1,23,742	1,27,027	07	2,50,776

కదిరి-6 వేరుశనగకు జాతీయ గుర్తింపు



ఉమ్మడి అనంతపురం జిల్లాలో వే రుశనగ ఎక్కువగా సాగుచేసే ది కదిరి పూర్వపు తాలూకాలోనే. దాదాపు 8 లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. వేరుశనగ రకాలను అభివృద్ధి చేయడానికి ప్రాంతీయ వ్యసాయ పరిశోధన స్థానాన్ని 1959 సంవత్సరంలో ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి 14 వేరుశనగ రకాలను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా కదిరి పేరుతో అనేక రకాలు వచ్చాయి. వాటిలో క దిరి - 6 (కె6) వేరుశనగ రకం ఎంతో ప్రఖ్యాతి చెందింది. 1993 లో జా తీయ స్థాయి గుర్తింపు పొందింది. దేశంలోని విత్తనోత్పత్తిలో 50 నుంచి 60 శాతం వర కు విత్తన కాయలు ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు.



నీళ్లు రాని హంద్రీనీవా కాలువ

సోలార్ హబ్‌గా నంబులపూలకుంట



కదిరి నియోజకవర్గంలోని నంబులపూలకుంట మండల కేంద్రంలో సోలార్‌హబ్‌ను ఏర్పాటుచేశారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నంబులపూలకుంటలో ప్రభుత్వ భూముల్లో యురేనియం డంపింగ్ యార్డు నిర్మాణానికి అనుమతినిచ్చారు. దాన్ని తీవ్ర స్థాయిలో ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ వ్యతిరేకించి భారీ ఉద్యమాన్ని నడిపారు. చివరకు రాకుండా చేశారు. ఆ తరువాత సోలార్‌హబ్ ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుతం 750 మెగావాట్ల విద్యుత్ ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తోంది.

కళా ప్రదర్శనల ద్వారా ఓటు హక్కుపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, మే 3: కళాప్రదర్శన ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, అర్బన్ నోడల్ అధికారి డిప్యూటీ తాహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని టవర్‌క్లాక్, ఆర్ట్స్ కళాశాల, సప్తగిరి ప్రధాన కూడళ్లలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా కళాప్రదర్శనలు, ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు తెలుసుకో.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో.. అంటూ నినాదాలు చేశారు. జాతీయ జెండా ప్రదర్శన, ప్రజాస్వామ్య విలువల్లో ఓటు హక్కు ప్రధాన భూమిక పోషిస్తుందని వారు వివరించారు. కాగా ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు బృందం ఆధ్వర్యంలో చేసిన నృత్య, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



స్వీప్ ఆధ్వర్యంలో ర్యాలీ

కదిరి అభివృద్ధే నా ధ్యేయం: కందికుంట

కదిరి, మే 3: కదిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నానని, 20 ఏళ్లుగా గెలుపోటములకు సంబంధం లేకుండా నియోజకవర్గ ప్రజలతోనే ఉండి వారి బాగోగులను చూసుకుంటున్నాని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. తలుపుల మండలకేంద్రంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమానికి హిందూపురం పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి హాజరయ్యారు. బత్రేపల్లి క్రాస్ నుంచి తలపుల వరకు దాదాపు 7 కిలోమీటర్లు మేర రోడ్డుషో సాగింది. ఇందులో వెయ్యికి పైగా బైక్‌లతో, వేలాదిమంది ఇతర వాహనాల్లో రోడ్‌షోలో పాల్గొన్నారు. తలుపుల గ్రామ శివారుల్లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద తలుపుల మండలవాసులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. 7చోట్ల వరసగా గజమాలలు వేశారు. అనంతరం తలుపులలో కందికుంట మాట్లాడుతూ కదిరి నియోజకవర్గం గడిచిన ఐదేళ్లలో అభివృద్ధిపరంగా పూర్తిగా వెనుకబడిందన్నారు. ఈ ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోయేలా కదిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలొచ్చాయని రాజకీయాలు చేసేందుకు వస్తున్న వ్యాపారులకు అవకాశం ఇవ్వకండని, ప్రస్తుతం వైసీపీ అభ్యర్థి మతాలను రెచ్చగొట్టే పనిలో ఉన్నారని చెప్పారు. మతాలను రెచ్చగొట్టడం తప్ప ఆయనకు మరొకటి తెలీదన్నారు. ఇటువంటి వారికి ఓటు వేయ కూడదని గ్రామగ్రామాన చెప్పాలన్నారు. అప్పుడే కదిరి ప్రాంతం లో హిందూ, ముస్లిం అన్నదమ్ముల్లా మెలుగుతారని అన్నారు. ఈ రోడ్డుషోకు మేడా శంకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి పవన్ కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


తలుపులలో మాట్లాడుతున్న కందికుంట

3వార్డులో కందికంట యశోదమ్మ ప్రచారం

కదిరిపట్టణంలోని 3వ వార్డుతో కందికుంట యశోదమ్మ ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకట ప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు. అలాగే 13,14, 15 వ వార్డుల్లో కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం ఇంటింటా నిర్వహించారు. అందరినీ ఓటును అభ్యర్థిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలతో 13వ వార్డు ఇన్‌చార్జి హైదర్, కౌన్సిలర్ మహబూబ్‌బాషా తదితర నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


తలుపులలో బీకే, కందికుంటకు గజమాలతో స్వాగతం


3వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

కూటమితోనే దళితులకు న్యాయం: సత్యకుమార్


సమ్మేళనంలో మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్

ధర్మవరంరూరల్, మే3: దళితుల అసైన్డుభూములను కూడా ఎమ్మెల్యే కేతిరెడ్డి వదల్లేదని, కూటమి అధికారంలోకి వస్తే దళితులకు న్యాయం జరుగుతుందని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సీఎస్‌బీ కల్యాణమండపంలో శుక్రవారం దళితుల సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి సత్యకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో దళితులపైనే అధికంగా దాడులు జరిగాయన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన ఓ డ్రైవర్‌ను హత్యచేసి డోర్‌డెలివరీ చేశారని, ఇలాంటి ఘటన ఎంతో దురదృష్టకరమని అన్నారు. కేంద్రప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం రాష్ట్రానికి వేలకోట్లు నిధులు ఇస్తే వాటిని దారి మళ్లించిన ఘనుడు ఈ జగన్ అని విమర్శించారు. ఇక్కడ ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి దళితులకు చెందిన అసైన్డు భూములను ఏదోవిధంగా మెలికి పెట్టి తక్కువధరలకు లాక్కొని గుర్రాల కోటలు కట్టుకున్నారని ఆరోపించారు. దళితులందరూ ఈ ఎమ్మెల్యేకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తేనే దళితులకు న్యాయం జరుగుతుందన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గంలోని దళిత వాడల్లో మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసెదేవానంద్, జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, జనసేన నాయకులు చిలకంమధు, ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శి శాంతకుమార్, ఎస్సీమహిళ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమార్ ఎన్నికల ప్రచారం

ధర్మవరంరూరల్: మండలంలోని ధర్మపురి, ఆకుతోటపల్లి, నాగిరెడ్డికుంట కొట్టాల, రావులచెరువు, యర్రగుంటపల్లి, తండా, వెంకటతిమ్మాపురం, మాలగుండ్లపల్లి, చిన్నూరుబత్తలపల్లి, మల్లాకాల్వ గ్రామాల్లో శుక్రవారం సత్యకుమార్ యాదవ్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేకు కమలం గుర్తుకు, ఎంపీకి సైకిల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

రెండోరోజూ నమిత రోడ్‌షో..

ధర్మవరం: పట్టణంలో ప్రముఖ సినీ నటి నమిత రోడ్ షో రెండో రోజు శుక్రవారమూ కొనసాగింది. సత్యకుమార్‌యాదవ్ గెలుపుకోసం ఆమె ప్రచారం నిర్వహించారు. కొత్తపేట సర్కిల్ నుంచి ప్రారంభించిన రోడ్డుషో గాంధీసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతిసర్కిల్, కాలేజ్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా సాయిబాబా ఆలయం వరకు సాగింది. ఆమెను చూడటానికి జనం ఎగబడ్డారు. ఆమె కమలం గుర్తును చూపిస్తూ సత్యకుమార్‌ను గెలిపించాలని కోరారు. అతను గెలిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి ధర్మవరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తారని తెలిపారు.


ఎన్నికల ప్రచారంలో నమిత

టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు


పరిటాలశ్రీరామ్‌సమక్షంలో టీడీపీ లోకి చేరిన వైసీపీ నాయకులు

బత్తలపల్లి, మే3: మండలంలోని గరశనపల్లి, కట్టకిందపల్లి గ్రామాలకు చెందిన 30 కుటుంబాల వారు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో వారు నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సమక్షంలో చేరారు. వారికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గరశనపల్లికికి చెందిన చిర్రప్ప, ప్రభాకర్, శివక్రిష్ణ, రవి, చిన్న, కట్టకిందపల్లి గ్రామానికి చెందిన తరిగోపుల నారాయణస్వామి, చల్లానారాయణస్వామి, ప్రతాప్‌నాయుడు, రామచంద్ర, జయచంద్ర నాయుడు, పెద్ద సంజీవ, సూర్యనారాయణ, పక్కీరప్ప ఉన్నారు.

జనసేనలోకి మాజీ కౌన్సిలర్ చేరిక

ధర్మవరం, మే 3: పట్టణంలోని మాజీ కౌన్సిలర్ సరితాలదస్తగిరి జనసేనలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చిలకం మధు ఆయనకు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.


చిలకం సమక్షంలో జనసేనలోకి చేరుతున్న మాజీ కౌన్సిలర్ సరితాల దస్తగిరి

ధర్మవరంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

● పట్టించుకోని అధికారులు

ధర్మవరం, మే 3: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. పట్టణంలో ఇంకా అక్కడక్కడ వైసీపీ స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. కోడ్ అమలై 50 రోజులు దాటి పోలింగ్ దగ్గర పడుతున్నా.. పలు ప్రాంతాలలో ఇళ్లకు వేసిన స్టిక్కర్లు తొలగలేదు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. 25వ వార్డులో సచివాలయం ఎదురుగా ఉన్న ఓ ఇంటికి సీఎం జగన్, ఎమ్మెల్యే కేతిరెడ్డి ఫొటోలతో ఉన్న స్టిక్కర్ దర్శనమిస్తోంది. దీనిపై ఎన్నికల అధికారులు స్పందించి కోడ్ ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు.


25వ వార్డులో సచివాలయం ఎదుట ఇంటికి ఉన్నవైసీపీ స్టిక్కర్

వైసీపీ ప్రచారంలో స్టోర్ డీలర్

కదిరి, మే 3: నంబుల పూలకుంట మండలంలోని గంగెద్దులవారిపల్లికి చెందిన లక్ష్మణరెడ్డి అనే స్టోర్ డీలర్ శుక్రవారం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ నాయకులు బాలక్రిష్ణ, హరీష్‌రెడ్డి, కన్వీనర్ రంగారెడ్డి గ్రామంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో స్టోర్ డీలర్ పాల్గొన్నారు. స్టోర్ డీలర్‌గా ఉన్నవారు ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదు. అయినా నిబంధనలు ఉల్లంఘించి లక్ష్మణరెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. స్టోర్‌లర్ పైచర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరుతున్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టోర్ డీలర్ లక్ష్మణరెడ్డి

మహిళ ఆత్మహత్య

నల్లమాడ, మే3: మండలంలోని మసకవంకపల్లికి చెందిన మల్లేశ్వరి(30) విషద్రావకం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ సూర్యనారాయణ శుక్రవారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని భవానీ నగర్‌కు చెందిన రమణ కుమార్తె మల్లేశ్వరికి 14 ఏళ్ల క్రితం మసకవంకపల్లికి చెందిన చంద్రశేఖర్‌తో వివాహమైంది. అయితే చంద్రశేఖర్, నాగభూషణ అన్నదమ్ముళ్లు. వారి మధ్య ఆస్తి తగదాలున్నాయి. దీంతో తరచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో నాగ భూషణంతో పాటు ఆడపడుచూ ఈశ్వరమ్మ, అత్త యల్లమ్మ మల్లేశ్వరిని సూటిపోటి మాటలతో తరచూ వేధిస్తుండేవారు. ఇందుకు మనస్థాపం చెందిన ఆమె గురువారం ఇంటిలో సూపర్ వాజ్మోల్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

పుట్టపర్తి అభివృద్ధిని పట్టించుకోని దుద్దుకుంట

ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర


బుచ్చయ్యగారిపల్లిలో ప్రచారం చేస్తున్న పల్లె సింధూరారెడ్డి


నాయనకోట తండాలో కూటమిలో చేరినవారితో మాజీ మంత్రి పల్లె, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

పుట్టపర్తి, మే 3: గత ఐదేళ్లుగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రశాంతి గ్రామంలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారన్నారు. ముఖ్యం సూపర్ సిక్స్‌పథకాలను అమలు చేస్తారని, వాటి వల్ల అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో ఏయే అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. సత్యసాయి నడయాడిన పుట్టపర్తిలో అరాచక పాలన కొనసాగించారని మండిపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధి కన్నా.. సొంతలాభం పైనే ధ్యాస పెట్టారని విమర్శించారు. ఎన్నికల్లో దుద్దుకుంటకు బుద్ధి చెప్పాలని కోరారు. తొలుత గ్రామంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు ఆమెకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, రామాంజినేయులు, అంబులెన్స్ రమేష్, కడియాల సుధాకర్, రామలక్ష్మణులు, బెస్తచలపతి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నం: మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, జానకంపల్లి గ్రామాల్లో పల్లె సింధూరారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రోడ్డుషో చేస్తూ.. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. సీనియర్ నాయకుడు పెద్దరాసు సుబ్రమణ్యం, కన్వీనర్ మల్లిరెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతమొందిద్దాం : మాజీ మంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు: గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని, ఈ ఎన్నికల్లో ఆ పాలనను అంతమొందిద్దామని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కొండకమర్ల పంచాయతీ నాయనకోటతండాలో శుక్రవారం అక్కులప్పనాయక్, వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో దాదాపు 60కుటుంబాల వారు కూటమి పార్టీల్లోకి చేరారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేయగా.. పల్లె హాజరై మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో ప్రజలు వైసీపీ అవినీతి పాలనతో విసిగిపోయారన్నారు. ఈ ప్రభుత్వం అభివృద్ధి చేయకపోగా, ఇసుక, మట్టి దోపిడీ, మద్యం మాఫియాతో పాలన సాగించిందన్నారు. ఎన్నికల్లో వైసీపీ పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం 60 కుటుంబాల వారు టీడీపీ, జనసేన లోకి చేరగా.. పల్లెతో పాటు జనసేన నియోజకర్గ ఇన్‌చార్జి పత్తిచంద్రశేఖర్ కండువాలు వేసి పార్టీలలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ ఓబులరెడ్డి, వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఎనుమలపల్లిలో వైసీపీ నాయకుడు ఎనమల గోవర్ధనరెడ్డితో పాటు 20కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరారు. గ్రామంలోనే మాజీమంత్రి పల్లెరఘునాథరెడ్డి సమక్షంలో వారు చేరగా.. ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కొత్తచెరువు: బుక్కపట్నం చెరువు చేపల సంఘం మాజీ అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు గొరమిద్ది చలపతి టీడీపీలోకి చేరారు. పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో పల్లె సమక్షంలో చేరారు. ఆయనకు పల్లె కండువా వేసి ఆహ్వానించారు.

గ్రామాల్లో పల్లె ఎన్నికల ప్రచారం

పుట్టపర్తి రూరల్: మండలంలోని పెడపల్లి, సుబ్బరాయినిపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీరామిరెడ్డి, సిమెంట్ పోలన్న తదితరులు పాల్గొన్నారు.

సత్యకుమార్ అనుచరులపై వైసీపీ వర్గీయుల దాడి



వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన బీజేపీ నాయకులు

ధర్మవరం, మే 3: పట్టణంలో బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ అనుచరులపై వైసీపీ వర్గీయులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. కదిరికి చెందిన శ్రీనివాసులు, హైదరాబాద్‌కు చెందిన భాను స్థానిక బీజేపీ కార్యాలయంలో ఉంటూ రోజు ప్రచారంలో పాల్గొంటున్నారు. వారిద్దరూ ధర్మవరం మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఓ కేఫ్ వద్ద ఉండగా అటు వైపు ప్రచారం చేస్తూ వైసీపీ వర్గీయులు వచ్చారు. 'ఏ ఊర్రా మీది..? మీ కులమేది..' అని దూషణకు దిగారు. తాము బీసీలమని చెప్పగా.. 'ఏరా.. బీసీ అభ్యర్థి వచ్చాడని బలిసిందా..? ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తున్నారు..' అంటూ దాడి చేశారు. వారి సెల్‌ఫోన్‌ను పగులగొట్టారు. తీవ్రంగా గాయపడిన బాధితులు బీజేపీ కార్యాలయం వద్దకు వెళ్లి నాయకులకు విషయం చెప్పారు. బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని బాధితులను పరామర్శించారు. అనంతరం బాధితులతో కలిసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయించారు. వైసీపీ వర్గీయులు మారుతి, వినయ్ తమపై దాడి చేశారని బాధితులు తెలిపారు. విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు అన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

నల్లచెరువు, మే 3: మండలంలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ సంజీవపల్లి, దేవిరెడ్డిపల్లి, ఉప్పార్లపల్లి, ఎర్రగుంట్లపల్లి, పెద్దయల్లంపల్లి ఎస్సీకాలనీ, పెద్దం యల్లపల్లి, వనంవారిపల్లి గ్రామాల్లో కూటమి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల ప్రయోజనాల గురించి వివరించారు. వాటి వల్ల ఎవరెవరికి ఏమేరలకు లబ్ధి చేకూరుతోందో వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారని తెలిపారు. కనుక కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు మాబూసాబ్, దాదెం శివారెడ్డి, ఫకృద్దీన్, లక్ష్మీపతినాయుడు, సర్పంచ్ హర్షవర్ధన్‌నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని నిడిగల్లు గ్రామంలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముంటిమడుగు హర్షవర్ధన్ టీడీపీ శ్రేణులతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన మంజుల వెంకటరాముడు, పవన్, పోతలయ్య, ధనుంజయ, ప్రసాద్, కృష్ణయ్య కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. కార్యక్రమంలో నాయకులు గణేశ్, పక్కీర్‌రెడ్డి, రంగయ్య, కుళ్లాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని వేపరాల పంచాయతీ వేపరాల, సీఎంతండా, చిన్నక్కగారిపల్లి, తాళ్లకాలువ గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య నాయకులు, కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి పథకాల ప్రయోజనాలను వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్‌ను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. తర్వాత వారి సమక్షంలో టీడీపీలోకి పలువురు చేరారు. కార్యక్రమంలో సింగిల్ విండోమాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మవరం, పరిగిలో వడగాలులు

పుట్టపర్తి రూరల్, మే 3: జిల్లాలోని ధర్మవరం, పరిగి మండలాల్లో శనివారం వడగాల్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని తెలియజేసింది.

అతుల్‌కుమార్ అంజన్ మృతి సీపీఐకి తీరనిలోటు

ధర్మవరం, మే 3: రైతుల పక్షాన నిలబడి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ఎప్పటికప్పుడు పరిష్కరింపజేస్తున్న కామ్రేడ్ అతుల్‌కుమార్ అంజన్ మృతి సీపీఐకి తీరని లోటని రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జేవీరమణ, ఏపీ రైతుసంఘంజిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న పేర్కొన్నారు. లక్నోలో శుక్రవారం అతుల్‌కుమార్ అంజన్ మరణించడంతో పట్టణంలోని సీపీఎం కార్యాలయ సమీపంలో నాయకులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా రైతుల సమస్యలపై నిర్విరామంగా పోరాడి వారి పక్షాన నిలబడిపోరాడిన వ్యక్తి అని కొనియాడారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎంపట్టణ కార్యదర్శి శేషంపల్లిమారుతి,చేనేత సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు పోలాలక్ష్మీనారాయణ, వెంకటనారాయణ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు ధర్మవరంలో సత్యకుమార్ ప్రచారం

ధర్మవరం, మే3: పట్టణంలో కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ ఎన్నికల ప్రచారం శనివారం ఉంటుందని ఎన్డీఏ కూటమి నాయకులు శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ ప్రచారం ఉదయం 8గంటలకు రాంనగర్, తారకరామాపురం, గుట్టకిందపల్లిలో, మధ్యాహ్నం 3:30గంటలకు సాయినగర్, సిద్దయ్యగుట్ట, పార్థసారధినగర్‌లలో ఉంటుందన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొననున్నట్లు చెప్పారు.

పండుటాకులకు పింఛన్ కష్టాలు



ధర్మవరంలో ఫింఛన్‌తీసుకునేందుకు క్యూలైన్‌లో ఉన్న వృద్ధులు



ముదిగుబ్బలో కెనరా బ్యాంకు వద్ద పడిగాపులు

● రెండో రోజూ బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు

ధర్మవరంరూరల్, మే3: పింఛన్ల పంపిణీలో ప్రభుత్వ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం పండుటాకులను ఏడిపిస్తోంది. ఈనెల పింఛన్ కొందరికి ఇంటి వద్ద, మరికొందరికి బ్యాంకుఖాతాల్లో జమచేయడంతో ఆ నగదు తీసుకోవడానికి ధర్మవరం రూరల్ మండలం నుంచి పెద్దఎత్తున వృద్ధులు పట్టణంలోని బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. రెండురోజు శుక్రవారం ధర్మవరంలో బ్యాంకుల వద్ద మండుటెండలో పింఛన్‌కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. ఉదయమే బ్యాంకుల వద్దకు చేరుకుని మధ్యాహ్నం వరకు నగదు తీసుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. క్యూలైన్‌లో నిలబడి గంటల కొద్ది వేచిచూశారు. ఎక్కడా బ్యాంకుల వద్ద కనీసం తాగునీరు కూడా లేకపోవడంతో ఎండలకు దాహార్తితో, ఉక్కపోతతో విలవిల్లాడిపోయారు. మాలాంటి వృద్ధులపైనా ప్రభుత్వం ప్రతాపం చూపేదంటూ పలువురు వృద్ధులు ఆవేదనకు లోనయ్యారు. సచివాలయాల్లో ఉన్న ఉద్యోగులతో పింఛన్ పంపిణీ చేయవచ్చు కదా అని పలువురు మండిపడ్డారు.

ముదిగుబ్బ: ప్రభుత్వం ఎన్నికల నియమావళి ప్రకారం సామాజిక పింఛన్ డబ్బులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసింది. అయితే ఈ డబ్బులను డ్రా చేసుకునేందుకు వృద్ధులు రెండో రోజు మండల కేంద్రంలోని బ్యాంకుల వద్ద క్యూలో నిలబడి గంటల కొద్ది వేచి ఉన్నారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన వృద్ధులు నానా అగచాట్లు పడ్డారు. ముదిగుబ్బ మండల కేంద్రానికి బుక్కపట్నం మండలంలోని కొన్ని గ్రామాలు గసికవారిపల్లి, చింతలయ్యగారిపల్లి, కృష్ణాపురం కూతవేటు దూరంలో ఉండడంతో, అక్కడి వృద్ధులు ఆటోలు, ద్విచక్రవాహనాలలో ముదిగుబ్బకు చేరుకున్నారు. సచివాలయాలలో అంతమంది ఉద్యోగులు ఉన్నారు, వారి చేత ఇంటింటికి పింఛన్ పంపిణీ చేయించొచ్చు కదా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

గాండ్లపెంట: ప్రభుత్వం పింఛన్ సొమ్మును బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వాటిని డ్రా చేయడానికి వృద్ధులు బ్యాంకుల వద్దకు చేరుకుని పడిగాపులు కాశారు. మండలంలోని పలువురు వృద్ధులు, వికలాంగులు పింఛన్‌ను డ్రా చేయడానికి గాండ్లపెంట ఏపీజీబీ బ్యాంక్ వద్దకువచ్చారు. అక్కడ గంగల కొద్దీ వేచి చూశారు. మారుమూల గ్రామాలనుంచి సైతం వృద్ధులు, వికలాంగులు బ్యాంకు వద్దకు పెద్దఎత్తున రావడంతో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. దీంతో వారు గంటలతరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. తమను ఇబ్బంది పెట్టడానికే ఖాతాల్లో జమచేశారని పలువురు వాపోయారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

పుట్టపర్తి , మే 3: జిల్లాలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలంటూ భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్‌వ్యాస్ ఆదేశించారు. ఢిల్లీనుంచి శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాలుగో దశలో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లోని ఎన్నికల అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్సులో జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు ఎస్పీ మాధవరెడ్డి , పార్లమెంటు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు అన్బుకుమార్, దీపక్ రామచంద్ర తివారి, పోలీసు అబ్జర్వర్ ఇమ్నాలెన్నా అమిత్‌కుమార్ పాల్గొన్నారు. ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కీలకమన్నారు. ఈవీఎంల వాడకం, హ్యాండ్ బుక్ నిర్వహణ, భద్రత, పోస్టల్‌బ్యాలెట్ తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టామని, రాష్ట్ర సరిహద్దులలో చెక్‌పోస్టుద్వారా నిఘా ఉంచామని, సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్లపై నిఘా పెట్టామని ఎస్పీ వివరించారు.


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ ఎన్నికల పరిశీలకులు

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోండి: కలెక్టరు

జిల్లాలో ఓటరుగా నమోదై ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులందరూ ఈ నెల 4,6 తేదీలలో నిర్వహించే పోస్టల్ బ్యాలెట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు ప్రకటనలో తెలిపారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్పెషిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామని, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయా నియోజవర్గాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు కూడా అక్కడే పోస్టల్ బ్యాలెట్ వేయాల్సి ఉంటుందన్నారు. ఇతర జిల్లాలో ఓటర్‌గా నమోదై జిల్లాలో ఎన్నికల పనిచేస్తున్న వారు కూడా ఇక్కడే పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు

క్రీడాకారిణికి సన్మానం

ఓబుళదేవరచెరువు, మే 3: జపింగ్ రోప్‌లో జాతీయ స్థాయిలో గోల్డ్‌మెడల్ అందుకున్న నాయనకోట తండాకు చెందిన విజయ కుమార్ కుమార్తె చంద్రుప్రియబాయిని శుక్రవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సన్మానించారు. గిరిజన తండాకు చెందిన చంద్రుప్రియ చిలమత్తూరు కేజీబీవీలో 9వ తరగతి చదువుతోంది. ఈఏడు జనవరిలో జపింగ్ రోప్ అసోషియేషన్ క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయి గోల్డు మెడల్, ఫిబ్రవరిలో జాతీయ స్థాయి గోల్డ్ మెడల్ సాధించింది. జూలై 21న జపాన్‌లో జరుగు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈమె ఇంటికి వెళ్లి మాజీ మంత్రి పల్లె, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజనప్ప శాలువాతో సన్మానించి అభినందించారు.

ఎక్కడ చూసినా టీడీపీ అభివృద్ధే...

ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



బూదిలి పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సవిత

గోరంట్ల, మే 3: గతంలో టీడీపీ అధికారంలో ఉండగా జరిగిన అభివృద్ధి మాత్రమే గ్రామాల్లో ఎక్కడ చూసినా కనిపిస్తోందని, వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత అన్నారు. గోరంట్ల మండలంలోని బూదిలి పంచాయతీ గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో పట్ల, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ, అడుగడగున తమకు అండగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు సైతం ఉత్సాహం చూపుతూ ముందుకు సాగుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమపథకాలను వివరించారు. గ్రామాల అభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా బీకే పార్థసారథిని సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల యువశేఖర్, అశ్వర్థరెడ్డి, బాలక్రిష్ణ, రవి, తదితరులు, జనసేన, బిజెపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

దోచుకెళ్లడానికే వస్తున్నారు

పెనుకొండ టౌన్: గుడ్‌మార్నింగ్ పేరుతో ఎమ్మెల్యే శంకర్ నారాయణ పెనుకొండలో కలియతిరిగి, అభివృద్ధి చేస్తానని నమ్మ బలికారని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. అయితే ఇక్కడ దోచుకుని నేడు పెనుకొండ ప్రజలకు బ్యాడ్‌మార్నింగ్ చెప్పి మరోచోటికి బదిలీ అయ్యారని విమర్శించారు. అదే తరహాలో దోచుకుని వెళ్లేందుకు ప్రస్తుతం మరో ఎమ్మెల్యే ఉష శ్రీచరణ్ వచ్చారన్నారు. సవిత శుక్రవారం పట్టణంలోని దర్గాపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెనుకొండలో ఎక్కడ చూసినా టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. గతంలో ఎక్కడ చూసినా ఎల్ఈడీ బల్బులు వెలిగించామని, అవి పోతే మార్చలేని పరిస్థితులు వైసీపీ పాలనలో ఉన్నాయన్నారు. మైనార్టీలకు టీడీపీ అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. టీడీపీ హయాంలో రంజాన్ తోఫా అందిస్తే వైసీపీ నిలిపివేసిందన్నారు. దీంతో తాము స్వచ్ఛందంగా నాలుగేళ్ల పాటు రెండు వేల మందికి రంజాన్ తోఫా అందించామన్నా రు. ఏది ఏమైనా వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు. మైనార్టీ నాయకులు దాదు, అత్తర్‌ఖాదిర్, జఫ్రుల్లా, షౌకత్, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, హుజురుల్లాఖాన్, హరీ, బాబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

పెనుకొండ టౌన్/ రొద్దం : వైసీపీ మైనార్టీ జిల్లా కార్యదర్శి రొద్దం మండలానికి చెందిన వజీర్‌బాష శుక్రవారం టీడీపీలో చేరారు. ఆయనతో పాటు నియోజకవర్గానికి చెందిన 60కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వారికి పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో కండువాలు వేసి ఆహ్వానించారు. రొద్దం మండలం కోగిర, పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లి, రాంపురం పంచాయతీ, గోరంట్ల మండలం సింగిరెడ్డిపల్లి, పరిగి మండలం గంగిరెడ్డిపల్లి, గోనిపల్లి, సోమందేపల్లి మండలం చాలకూరు నుంచి పార్టీలో చేరారు. గోరంట్ల మండలానికి చెందిన గణేష్, బాబు, సూరి, నాగభూషణం, అశ్వత్థ, వేణు, శంకర్, భాస్కర్, పరిగి మండలం శీగుపల్లికి చెందిన రామాంజనేయులు, అశ్వత్థప్ప, రామాంజినప్ప, అనిల్, అజయ్, రాము, రమేష్, నరసింహులు, సోమందేపల్లి మండలం శంకరప్ప, చిరంజీవి, నరసింహమూర్తి, నవీన్, ముత్యాలప్ప తదితరులు పార్టీలో చేరారు.



పెనుకొండ దర్గాపేటలో ప్రచారం నిర్వహిస్తున్న సవిత



టీడీపీలో చేరుతున్న జిల్లా మైనార్టీ కార్యదర్శి వజీర్‌బాషా

ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వండి

నోడల్ అధికారికి టీడీపీ నాయకుల వినతి



ఎన్నికల నోడల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మే 3 : ఎన్నికల విధుల్లో పాల్గొనే ఓపీఓలకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని తెలుగుదేశం పార్టీ తరుపున నాయకులు డిమాండ్ చేశారు. హిందూపురం నియోజకవర్గం ఎన్నికల నోడల్ అధికారి, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి శుక్రవారం టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, సర్పంచ్ మంజునాథ్, టీఎన్ఎస్ఎఫ్ యుగంధర్ వినతిని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఓపీఓలను నియమిస్తూ గురువారం ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారని, కానీ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసేందుకు గడువు ముగిసిందని విన్నవించారు. ఇలాంటి పరిస్థితుల్లో వేరే నియోజకవర్గాల్లో పనిచేసేవారు వేరేచోట ఎన్నికల విధుల్లో పాల్గొంటే ఓటువేయడానికి వీలుండదన్నారు. దీనివల్ల ఒక్క హిందూపురం నియోజకవర్గంలోనే 750 మందికిపైగా ఓటు వేసుకునేందుకు వీలుండదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.50లక్షల మందిదాకా ఓపీఓలు ఉన్నారని తెలిపారు. దీంతో వారి పరిస్థితి ఏంటన్నారు. దీనిపై ఎన్నికల కమిషనర్‌కు తెలియజేసి వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని వినతిలో కోరారు.

రూ.2 లక్షల నగదు పట్టివేత

మడకశిర రూరల్, మే 3: మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న యూ రంగాపురం చెక్‌పోస్టులో చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.2 లక్షలు నగదు పట్టుకున్నట్లు పోలీసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రం తుముకూర్ నుంచి పావగడకు వెళ్తున్న కేఏ 06 ఎంవీ0962 కారులో ఆ సొమ్ము తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఆ నగదును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీతోనే అభివృద్ధి.. సంక్షేమం

ఎన్నికల ప్రచారంలో వసుంధరాదేవి



ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న నందమూరి వసుంధరాదేవి

హిందూపురం, మే 3 : టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షే మం పరుగులు పెడతాయని టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి అన్నారు. ఆమె శుక్రవారం పట్టణంలోని బోయపేట, విద్యానగర్, కోట ప్రాంతంలో ఎన్నిక ల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడోసారి బాలకృష్ణను గెలిపించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పురం ప్రశాంతంగా, అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందన్నారు. పురంలో టీడపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ పాలనలో చేసిన పని ఎక్కడైనా కనబడుతోందా అని ప్రశ్నించారు. సీసీరోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ సిస్టం, బెంగళూరు రోడ్డు విస్తరణ పనులతో పాటు పట్టణానికే చిహ్నంగా ఉన్న కూరగాయల మార్కెట్ టీడీపీ కాలంలో నిర్మించిందే అన్నారు. గొల్లపల్లి నుంచి నీటిని తెచ్చి దశాబ్దాల సమస్యను బాలకృష్ణ రూపుమాపారన్నారు. హిందూపురం ప్రజల ఆరోగ్యం, విద్యకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఎంతోమంది నిరుపేదలకు క్యాన్సర్ ఆసుపత్రిలో తక్కువ ఖర్చుతో వైద్యం అందించామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య రథం ద్వారా వేలాది మంది దీర్ఘకాలిక రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి ప్రతినెలా మందులు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతా మన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ రావిళ్లలక్ష్మి, జేవీ అనిల్‌కుమార్, పట్టణా ధ్యక్షుడు రమేష్, హిదాయతుల్లా, హనుమంతు, శివ, మురళిస్వామి, చంద్రమోహన్, ఆయా వార్డుల నాయకులు పాల్గొన్నారు.



వసుంధరాదేవి సమక్షంలో పార్టీలో చేరిన వెంకటేశ్‌రెడ్డి

వైసీపీ రెబల్ అభ్యర్థి టీడీపీలోకి : ఈ ఎన్నికల్లో వైసీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి పరిశీలనలో తిరస్కారానికి గురైన వెంకటేశ్‌రెడ్డి నందమూరి వసుంధరాదేవి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వైసీపీ అభ్యర్థి దీపిక భర్త వేణురెడ్డికి సమీప బంధువు కావడంతోపాటు సీఎం పర్యటనకు ముందురోజు వెంకటేశ్‌రెడ్డి టీడీపీలో చేరడం వైసీపీలో కలకలం రేపుతోంది. పార్టీలో చేరిన వెంకటే శ్‌రెడ్డి మాట్లాడుతూ బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తమవంతు కృషిచేస్తానని తెలిపారు. వైసీపీలో ప్రాధాన్యత లేకపోవడమే కాక ఆ పార్టీలో అవకతవకలు జీర్ణించుకోలేక బయటకు వచ్చినట్లు తెలిపారు.

వైసీపీ సర్పంచ్ జయలలిత చేరిక

చిలమత్తూరు: మండలంలోని చాగలేరు పంచాయతీ సర్పంచ్ జయలలిత, ఆమె భర్త జనార్దన రెడ్డి, మరో వైసీపీ నాయకుడు శంకరరెడ్డి వైసీపీని వీడి శుక్రవారం నందమూరి వసుందరాదేవి సమక్షంలో టీడీపీలో చేరారు. కొడికొండ చెక్‌పోస్టులోని రక్షా అకాడమిలో బస చేసిన నందమూరి వసుంధరా దేవిని వారు టీడీపీ మండల నాయకులు నాగరాజు యాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, రంగారెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఆమె వారికి టీడీపీ కండువా కప్పి సాదరంగా అహ్వానించారు.



నేడు ధర్మవరం, పరిగిలో వడగాలులు

పుట్టపర్తి రూరల్, మే 3: జిల్లాలోని ధర్మవరం, పరిగి మండలాల్లో శనివారం వడగాల్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వీలైనంత వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని తెలియజేసింది.

వైసీపీలో ఇమడలేక రాజకీయాలకు స్వస్తి

వాల్మీకి నాయకుడు బోయ లక్ష్మీనారాయణ

గోరంట్ల, మే 3: వైసీపీలో చేరిన రెండురోజులకే ఆ పార్టీలో ఇమడలేక రాజకీయాలకు స్వస్తి పలుకుతున్నట్లు వాల్మీకి రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ఆయన, వారం రోజుల కిందట బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. రెండురోజుల కిందట మంత్రి ఉషశ్రీ చరణ్ స మక్షంలో బుధవారం వైసీపీ కండువా వేసుకున్నారు. ఉన్నఫలంగా కొన్నిరోజులపాటు రాజకీయాలకు దూ రంగా ఉండాలని, తన వ్యక్తిగత కారణాల వలన ఇలా చేస్తున్నట్లు ఆయన ప్రస్తుతం తెలిపారు.

నేడు రొళ్లలో టీడీపీ ఎన్నికల ప్రచారం

మడకశిరటౌన్, మే 3: తెలుగుదేశంపార్టీ అభ్యర్థులకు మద్దతుగా రొళ్ల మండలంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గం సమన్వయ కర్త గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఉదయం 10 గంటలకు హులికుంట పంచాయతీ పరిధిలో, 12 గంటలకు గుడ్డగుర్కి పంచాయతీ పరిధిలో ప్రచారం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 1 గంటకు దొడ్డేరి, 3 గంటలకు కాకి, 4 గంటలకు రత్నగిరి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

'భూమి మా తండ్రిదే..'

పెనుకొండ రూరల్, మే 3: భూమి మా తండ్రిదే. ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదు. భూమికి సంబంధించిన అన్ని రికార్డులు ఉన్నాయని పెనుకొండ మండలం అమ్మవారిపల్లి కి చెందిన బోడప్పగారి వెంకటరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ... చిన్నప్పరెడ్డిపల్లిలో సర్వేనంబరు 786లోని 4.83 ఎకరాల భూమిని తమ తండ్రి వెంకటరాముడు 1965లో కొనుగోలు చేశారని తెలిపారు. ఇందులో ఎకరా భూమిని ఇళ్లపట్టాల కోసం ప్రభుత్వానికి అంద జేశామన్నారు. సర్వేనంబరు 786-2వ లెటర్‌లో తమ భూమికి ఆనుకుని కురుబ వీరజిన్నప్ప స్థలం ఉందన్నారు. తమ స్థలంలో ఎందుకు గడ్డివాము వేశావని ప్రశ్నించామే తప్ప ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదన్నారు.

బోరు నీటి విషయంలో ఆత్మహత్యాయత్నం

శింగనమల మే 3: మండలం పెరవలి రెవెన్యూ పొలంలో బోరు నీటి విషయమై అన్న తమ్ముడిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. నాయనపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు కోదండరాముడు, మల్లికార్జున. వీరికి పెరవలి రెవెన్యూ సర్వేనెంబరు 159-ఏ పొలంలో పొత్తల వ్యవసాయ బోరు ఉంది. ఆ బోరు నీటిని వాడుకోవడంలో వారిద్దరి మధ్య కొంతకాలంగా విభేదాలు వచ్చాయి. శుక్రవారం కూడా వీరి మధ్య ఘర్షణ జరిగింది. కొదండరాముడు, అతని కుమారుడు చంద్రశేఖర్ కలసి మల్లికార్జునపై పథకం ప్రకారం రాళ్లు, కట్టెలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. మల్లికార్జున తలకు తీవ్ర గాయమైంది. ఆ దాడి నుంచి తప్పించుకున్న మల్లికార్జున శింగనమల పోలీస్‌స్టేషన్ వచ్చాడు. శింగనమల ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైనా చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. మల్లికార్జున మాట్లాడుతూ... తన అన్న, అన్న కుమారుడు తనపై పలుమార్లు దాడి చేశారని, తన భూమిని కాజేయాలని చూస్తున్నారని, తనను హత్య చేయడానికి యత్నిస్తున్నారని వాపోయాడు. కేసు దర్యాప్తులో ఉంది.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు



ఎన్నికల ప్రచారంలో ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర రూరల్, మే 3: టీపీపీతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని టీపీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి మండల పరిధిలోని జీవీ పాళ్యం, గోవిందాపురం, కదిరేపల్లి, వైబీ హళ్లి, మెళవాయి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులకు గ్రామాల్లో అడుగడుగునా మహిళలు, రైతులు, ప్రజలు బహ్మారథం పట్టారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ... ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో వైసీపీ రాక్షసపాలన సాగిందన్నారు. రాష్ట్రాభివృద్ధి చాలా వెనుకబడిందన్నారు. రాష్ట్రం మళ్లీ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు మాట్లాడుతూ... ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఏమీలే దన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి మేని ఫెస్టోలోని పథకాలను గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీ నర్ లక్ష్మీనారాయణ, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను సస్పెండ్ చేయండి

మడకశిరటౌన్: గుడిబండ మండలం కరికెర పంచాయతీ పరిధిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను సస్పెండ్ చేయాలని ఎంఎస్ రాజు శుక్రవారం మడకశిర ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరి శంకర్‌కు ఫిర్యాదు చేశారు. గుడిబండ మండలం కరికెర పంచాయతీకి చెందిన వలంటీర్లు ప్రకాష్, దాసేగౌడ్ వైసీపీ ప్రచార కార్యకర్తలుగా పాల్గొన్నారని తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని, వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఆదేశాలు జారీ చేయాలని ఎంఎస్‌రాజు విజ్ఞప్తి చేశారు.

గుడిబండ : రాష్ట్రంలో ఈ నెల 13న జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి అసెంబ్లీ అభ్యర్థి ఎంఎస్‌రాజు, పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు సతీమణి ఉమాదేవి ప్రజలను కోరారు. ఆమె శుక్రవారం మండలంలోని మోరుబాగల్ పంచాయతీ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అమెకు మహిళలు బ్రహ్మరథం పట్టి ప్రచార కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంజుల, రాజన్న టీడీపీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి ఉమాదేవి

పింఛన్ కోసం పాట్లు

బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

గుడిబండ, మే 3: వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ మొత్తాలను ఎన్నికల నేపథ్యంలో అధికారులు వారివారి బ్యాంక్ ఖాతాలకు జమచే వారు. దీంతో పింఛన్ సొమ్ము కోసం లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే బ్యాంక్ అధికారులు మాత్రం ఇప్పుడు రద్దీ ఉందని సాకులు చెబుతూ రేపు, ఎల్లుండి వచ్చి తీసుకోండంటూ వెనక్కు పంపుతున్నారని వృద్ధులు వాపోతున్నారు. మండలంలోని మందల పల్లి, గుడిబండ కెనరాబ్యాంక్ బ్రాంచ్‌లు, రాళ్లపల్లి, మోరుబాగల్‌లో యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లు ఉన్నాయి. పింఛన్ మొత్తాలు ఈ బ్యాంకుల్లోని లబ్ధిదారుల ఖాతాలకు జమ అయ్యాయి. బ్యాంకుల నుంచి పింఛన్ సొమ్ము తీసుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నా మని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇదిలాఉంటే కొంతమంది పింఛన్ సొమ్మును బ్యాంకర్లు పాత అప్పులకు జమచేసుకుంటున్నారని, ఇలా అయితే తమ నెలవారీ అవసరాలు ఎలా తీర్చుకునేదని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వాపోతున్నారు. బ్యాంకుల్లో తగినంత సిబ్బంది ఉన్నా పింఛన్ మొత్తాలను లబ్ధిదారులకు అందించలేకపోతున్నారని వాపోతున్నారు. అధికారులు వెంటనే చొరవ తీసుకుని లబ్ధిదారులకు ఈ నెల పింఛన్ సొమ్ము అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



పింఛన్‌దారులు, ఖాతాదారులతో రద్దీగా ఉన్న గుడిబండ బ్యాంకు

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం : అనారోగ్యం, అప్పులతో జీవితంపై విరక్తి చెందిన పాపంపేటకు చెందిన ఆటో డ్రైవర్ నూర్ మహమ్మద్ (32) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను కొంత కాలంగా అస్తమా, జాండిస్‌తో బాధపడుతున్నాడు. వాటికి నయం చేసుకోవడానికి రూ.లక్షల్లో అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గం కనిపించకపోగా, అనారోగ్యం బాధ పెడుతుంటే మనస్తాపంతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఖాసింబి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎరుకుల సంఘం అధ్యక్షుడిగా సాకే మురళి

అనంతపురంరూరల్ :

ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజాసంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా యువజన విభాగ అధ్యక్షుడిగా అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన సాకే మురళి నియమితుడయ్యారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవి, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కావేటి ఉమామహేశ్వరి అతనికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

నాలుగేళ్లయినా పరిష్కారం కాని సమస్య



నడిరోడ్డులో ప్రమాదానికి నెలవుగా మారిన గుంత

మడకశిరటౌన్, మే 3: మడకశిర పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నడిరోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి నాలుగేళ్లు గడుస్తోంది. ఇది వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా మా రింది. అయితే దానిని పూడ్చి సమస్య పరిష్కరిద్దామని ఆలోచన చేసేవారు లేకపోవడం గమనార్హం. దీంతో సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. గుంతను పూడ్చాలని ప్రజా ప్రతి నిధులకు, అధికారులకు పట్టణ వాసులు అనేక సార్లు విన్నవించినా సమస్య పరిష్కారానికి ఎవరూ చొరవ చూపలేదు. నడిరోడ్డుపై గుంత ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు చాలా ఉన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు మాత్రం రెండు రాళ్లు గుంతకు అడ్డంగా పెట్టి వదిలేస్తున్నారు. తిరిగి సమస్య యథావిధిగా మారడంతో ప్రతి నిత్యం హిందూపురం, పెనుకొండ, పావగడ వెళ్లే వందలాది వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకూ పట్టణంలో భారీ వాహనాల సంచారం పెరుగుతుండటంతో గుంత పెరుగుతూ ప్రయాణికులకు నరకయాతన చూపుతోంది. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

గోరంట్ల, మే 3: పట్టణంలోని ప్రధాన రహదారిలోని పాత పోస్టాఫీసు సర్కిల్‌లో మురుగునీటికోసం ఏర్పాటుచేసిన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారి కూడలి నుంచి జామీయా మసీదుకు వెళ్లే రహదారిలో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వీధుల్లోని ఇళ్ల నుంచి రోడ్డుపైకి వచ్చే మురుగునీటి నిలువ వలన దుర్వాసనతోపాటు దోమలకు నిలయంగా మారిందని ఆ వీధి ప్రజలంటున్నారు. హిందూపు రం - కదిరి ప్రధాన రహదారి పక్కన మురుగునీరు మ్యాన్‌హోల్‌పై భద్రత కోసం మూత ఏర్పాటు చేయలేదు. విద్యుత్ లేని సమయంలోనూ, వర్షాకాలంలో పాదా చారులు, వాహనాలు మ్యాన్‌హోల్‌లో పడే ప్రమాదం లేకపోలేదు. పలుమార్లు ఫిర్యా దు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



రహదారిపై మురుగునీటి కాలువ, మ్యాన్‌హోల్

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

హిందూపురం అర్బన్, మే 3: తెలుగుదేశం పార్టీతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని టీడీపీ మాజీ సర్పంచ్ హెచ్ఎన్ రాము పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని కిరికెర, మిట్టమీదపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి బాలయ్యతోనే సాధ్యమన్నారు. టీడీపీ కూటమి ఉమ్మడి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.

చిలమత్తూరు: మండలంలో టీడీపీ నాయకుల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల తేదీ దగ్గర పడుతుండడంతో ప్రతి ఇంటికి వెళ్లి అభ్యర్థుల విజయం కోసం ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మండలంలోని కోడూరు, చిలమత్తూరు పంచాయతీల్లో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ, ఎంపీ అభ్యర్థి పార్థసారథికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పించారు. కోడూరులో నాయకులు సోమశేఖర్, శ్రీదేవి, మీసేవ సూరి, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, గంగాధర, నారాయణప్ప, నాగార్జున, వెంకటేశులు, ఉరుము నంజుండ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. చిలమత్తూరు లో దేమకేతేపల్లి అంజినప్ప, రంగారెడ్డి, నాగరాజుయాదవ్, నందీషప్ప, గౌరీశంకర్, లక్ష్మీనారాయణయాదవ్, నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, వేణు, రామప్ప, శివ, అశ్వత్థప్ప, గంగప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, బడుగు బలహీన వర్గాలకు అన్ని పథ కాలు సక్రమంగా అందాలన్నా ఒక్క టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ జయ ప్ప అన్నారు. మండల వ్యాప్తంగా శుక్రవారం అన్ని పంచాయతీలలో టీడీపీ నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను వివరిస్తూ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగళి: మండలకేంద్రమైన అగళితో పాటు ఇరిగేపల్లి, దొక్కలపల్లి, నందరాజనపల్లి, తదితర గ్రామాలలో శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమారస్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, మాజీ ఎంపీపీ నరసింహప్ప పాల్గొన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఆయకట్టు ప్రెసిడెంట్ చిదానందప్ప, రమేష్, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి జగన్..?

ఏమి చేశావని పురానికి రాక: సీపీఐ నాయకులు

హిందూపురం అర్బన్, మే 3: గత ఎన్నికల్లో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నీవు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి జగన్ అని సీపీఐ హిందూపురం కార్యదర్శి వినోద్‌కుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఐ నాయకులు మాట్లాడారు. హిందూపురాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని గత ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చావన్నారు. కానీ ఒక్కటి కూడా ఎందుకు నెరవేర్చలేదని సీఎం జగన్‌ను నిలదీశారు. ఏ ప్రభుత్వమైనా ముందుగా విద్యా వైద్య రంగాలు బాగుండాలని ఆలోచిస్తారని, మరి హిందూపురంలో కనీస చదువులు చదవడానికి బాలురకు ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు లేవన్నారు. రూ. లక్షలకు లక్షలు వెచ్చించి చదివించలేక విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేశారని, ఆ చోద్యం చూడటానికి వస్తున్నావా అని ప్రశ్నించారు. లేదా ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కానింగ్, మందుల కొరతను పరిశీలించడానికి వస్తున్నావా. అదీకాకపోతే పారిశ్రామిక వాడలో వేలాది మంది కార్మికులు ఉన్నా... వారికి కనీసం ఈ ఎస్ఐ ఆసుపత్రిలో సౌకర్యాలు, మందులు లేవని చూసి ఆనందించడానికి వస్తున్నావా అన్నారు. రైతులకు అనుకూలించే విధంగా హంద్రీనీవా నీరు ఒక్క చెరువుకైనా అందించావా అని ప్రశ్నించారు. హిందూపురానికి ఏం చేశావని వస్తున్నావు జగన్ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు బాబు, పట్టణ కార్యదర్శి మారుతీరెడ్డి, కృష్ణ, జబివుల్లా, సమీవుల్లా, జియా, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.